ఉత్తీర్ణత శాతం పెంచాలి: డీఐఈవో

దేవరకొండ, న్యూస్‌టుడే: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకు అవసరమైతే ప్రత్యేక తరగతులతో ఉత్తీర్ణతశాతాన్ని పెంచాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి దస్రునాయక్ అన్నారు. దేవరకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థుల హాజరుశాతాన్ని ప్రతి నిత్యం పరిశీలించాలని, వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. దేవరకొండ, చింతపల్లి ప్రిన్సిపాళ్లు మల్లయ్య, ధనరాజ్, అధ్యాపకులు బత్తుల సాయిలు, వెంకటేశ్వర్లు, రాజు, జయప్రకాష్, అమీనాపర్వీన్, నవత, శ్రీను, నాజర్నేన్, పార్థసారధి తదితరులున్నారు.

డైట్ కళాశాల ఎదుట నిరసన


నల్గొండలోని ప్రభుత్వ డైట్ కళాశాల ఎదుట నిరసన తెలుపుతున్న టీఎస్‌సీపీఎస్‌ఈయూ నాయకులు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: తెలంగాణ స్టేట్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ యూనియన్ (టీఎస్‌సీపీఎస్ ఈయూ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో పెన్షన్ ఆక్రోష్ మార్చ్ కార్యక్రమాన్ని నల్గొండలో నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాలలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పున్న సోమనాథ్ మాట్లాడారు. గత 20 ఏళ్లుగా సీపీఎస్ విధానం కొనసాగిస్తున్నా.. ఉద్యోగ విరమణ పొందిన వారికి కనీసం రెండుమూడు వేల రూపాయలు రావడం లేదని చెప్పారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు వీరమళ్ల శ్రీనివాస్, తండు భానుప్రకాష్, శివ, శ్రీనివాస్ రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఆదేశాలు రద్దు

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: పాఠశాలల్లో ఉచితంగా సేవలు అందిస్తామని ముందుకొచ్చిన గ్లోబల్ ఫౌండేషన్‌కు అనుమతిస్తూ ఈ నెల 9న ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసినట్లు డీఈవో భిక్షపతి తెలిపారు. హెచ్‌ఎం, ఎంఈవోల నుంచి ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఆ ఫౌండేషన్ ప్రతినిధులను పాఠశాలలకు అనుమతించొద్దని సూచించారు.

రూ.750 కోట్లతో

పర్యాటక ప్రాంతాల అభివృద్ధి

‘ఈనాడు’తో పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి

ముఖాముఖి



పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.750 కోట్లను కేటాయించామని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ పటేల్ రమేశ్‌రెడ్డి అన్నారు. ఇందులో రూ.500 కోట్లను ఒక్క రాష్ట్ర ప్రభుత్వమే ఇచ్చిందని, మిగిలిన నిధులు కేంద్రం ద్వారా వస్తున్నాయన్నారు. పలు చారిత్రక ప్రాంతాల్లో ఇప్పటికే ఈ నిధులతో పలు పనులు మొదలయ్యాయన్నారు. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిని గత భారాస ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఆయన ‘ఈనాడు’తో ప్రత్యేకంగా మాట్లాడారు.

రూ.100 కోట్లతో సాగర్ అభివృద్ధి..

✦ నాగార్జునసాగర్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చిన రూ.100 కోట్లను కేటాయించాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టితో ఈ ప్రాంతాన్ని పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అభివృద్ధి చేస్తున్నారు. బుద్ధవనం, ప్రాజెక్టులో ద్వీపంగా ఉన్న చాకలిగట్టును ప్రత్యేకంగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు రూపొందించాం. ఈ (చాకలిగట్టు)ద్వీపానికి చేరుకునేందుకు తీరం నుంచి ప్రత్యేకంగా బోట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

✦ సాగర్‌కు వచ్చే పర్యాటకుల కోసం ప్రస్తుతమున్న విజయ్‌విహార్ హోటల్‌ను విస్తరించడంతో పాటూ మరో రెండు హోటళ్లను ఏర్పాటు చేయనున్నాం. బుద్ధవనంలోనూ త్వరలోనే మూడు నక్షత్రాల హోటల్ రాబోతోంది. సాగర్ ప్రాజెక్టుతో పాటూ వెనక జలాలు ఉన్న వైజాగ్‌కాలనీని సైతం పర్యాటకంగా అభివృద్ధి చేస్తాం. ఇక్కడ ఏకో టూరిజంతో పాటూ కాటేజీల నిర్మాణం, వ్యూ పాయింట్లను ఏర్పాటు చేస్తాం. ఏడాదిలోపు ఈ పనులన్నీ పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటున్నాం.

వచ్చే నెలాఖరులోగా రోప్‌వే టెండర్లు..

❑ భువనగిరి కోటపైకి రోప్‌వేను ఏర్పాటు చేయడానికి రూ.50 కోట్లు ఖర్చు చేస్తున్నాం. అక్టోబరు నెలాఖరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తై పనులు ప్రారంభం కానున్నాయి. కోట కింద ఇన్నాళ్లు భూ సమస్య ఉండటంతో రోప్‌వే ఏర్పాటులో జాప్యం జరిగింది. దాన్ని త్వరలోనే పరిష్కరిస్తాం. కింద ఫుడ్‌కోర్టులతో పాటూ పర్యాటకులకు వసతి, బస కల్పించేందుకు వీలుగా హోటళ్ల నిర్మాణం చేయాలనే ఆలోచన ఉంది.

ఆధ్యాత్మిక సర్క్యూట్‌గా యాదాద్రి..

భువనగిరి, యాదాద్రి, కొలనుపాక, రాజపేటను కలుపుతూ పర్యాటక, ఆధ్యాత్మిక సర్క్యూట్‌గా ఏర్పాటు చేస్తాం. అందుకు ప్రతిపాదనలన్నీ సిద్ధమయ్యాయి. హైదరాబాద్‌తో పాటూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఈ సర్క్యూట్‌ను వీక్షించేందుకు ప్రత్యేకంగా ప్యాకేజీలు నిర్ణయిస్తాం. దీని వల్ల ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకుంటాం.

ఆదాయ మార్గాలపై అన్వేషణ

ఉమ్మడి నల్గొండ జిల్లాలో కృష్ణా పరివాహక ప్రాంతాలతో పాటూ రాచకొండ గుట్టలను అభివృద్ధి చేస్తే పర్యాటకులు పెరిగి ప్రభుత్వానికి ఆదాయం వచ్చే వీలుండేది. గత పదేళ్ల ఈ ప్రాంతాలను నిర్లక్ష్యం చేశారు. చారిత్రక కట్టడాలతో పాటూ పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ప్రతి ప్రాంతానికో నివేదికను తయారు చేస్తున్నాం. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే ప్రాంతాలపై మొదట దృష్టి పెట్టాం.

- ఈనాడు, నల్గొండ:

నడిపించేవారు లేక.. నరకయాతన..!

ఈనాడు, నల్గొండ – న్యూస్‌టుడే, నల్గొండ అర్బన్, సూర్యాపేట (తాళ్లగడ్డ), భువనగిరి గంజ్: రోగులకు కార్పొరేట్ వైద్యం అందించాల్సిన జిల్లా ప్రధాన ఆసుపత్రుల్లో అజమాయిషీ లేకపోవడంతో సామాన్యులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రూ.లక్షల విలువైన పరికరాలున్నా వాటిని నిర్వహించే వైద్యులు, ఆపరేటర్లు లేకపోవడంతో అవి మూలకుపడ్డాయి. నల్గొండ, సూర్యాపేట, భువనగిరిలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రు(జీజీహెచ్)లను ‘ఈనాడు’ గురువారం పరిశీలించగా.. పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.


నల్గొండ: రక్తనమూనాల పరీక్షల కేంద్రం వద్ద ఇలా..

పరిశీలన

• వైద్యులు, ఆపరేటర్లు లేక మూలకు పడ్డ యంత్రాలు


నల్గొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

నల్గొండ జీజీహెచ్‌లో...

☛ గుండె రోగులను పరిశీలించే 2డీ ఇకో, ఈసీజీ మిషన్లు పనిచేయడం లేదు. గుండె సంబంధిత వైద్యుడు (కార్డియాలజిస్టు) లేకపోవడంతో వీటిని పట్టించుకునేనాథుడు లేదు. దీంతో రూ.లక్షల విలువైన పరికరాలు వృథాగా పడి ఉన్నాయి.

☛ ఆపరేషన్ల సమయంలో మనిషి ఎక్స్‌రే ఫొటోలను కచ్చితంగా గుర్తించే సీ - ఆర్మ్ మిషన్ నిరుపయోగంగా మారింది. సుమారు రూ.13 లక్షలకు పైగా విలువ చేసే మిషన్ పనిచేయకపోయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

☛ ఆసుపత్రిలో ప్రస్తుతం అంతా ఇన్‌ఛార్జుల పాలనే సాగుతోంది. గత ఏడు నెలల్లో నలుగురు సూపరింటెండెంట్లు మారగా.. వైద్య కళాశాల ప్రిన్సిపళ్లు సైతం ముగ్గురు మారారు. ఆసుపత్రిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఆర్‌ఎంవోలు మొత్తం 8 మంది ఉండాల్సి ఉండగా..ఐదుగురు మాత్రమే ఉన్నారు.

☛ కీలకమైన డయాలసిస్ కేంద్రంలో మూత్రపిండాల నిపుణులు లేరు. ప్రస్తుతం సాంకేతిక నిపుణుడితోనే ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.

☛ మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఓపీకి వచ్చే సామాన్యులంతా బయట ప్రైవేటు మెడికల్ దుకాణాల్లోనే మందులు కొనుగోలు చేస్తున్నారు.

☛ మందుల సరఫరాతో పాటూ రోగులకు భోజనం అందించే కాంట్రాక్ట్ కాలపరిమితి ముగిసి మూడు నెలలు గడిచినా కొత్తగా టెండర్లు పిలవడం లేదు.

☛ ఇటీవల జరిగిన బదిలీల అనంతరం వైద్య, విద్య సంచాలకుల పరిధిలో మొత్తం 77 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం కేవలం 33 మందే ఉన్నారు. మిగిలిన 44 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

☛ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ సర్జన్ స్పెషలిస్టులు 62 ఉండాలి. కానీ ప్రస్తుతం 39 మంది ఉండగా.. 23 ఖాళీలున్నాయి. డిప్యూటీ సివిల్ సర్జన్‌లు 34 మంది ఉండాల్సింది..ప్రస్తుతం 8 మంది ఉండగా. .26 ఖాళీలున్నాయి. సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు 121 గానూ ప్రస్తుతం 21 మందే ఉండగా... 100 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

భువనగిరిలో...

◆ భువనగిరిలో గత ప్రభుత్వం వైద్యకళాశాలను ఏర్పాటు చేయగా.. ఇటీవల అనుమతులు వచ్చాయి. మొత్తం 220 పడకలు ఉండాల్సి ఉండగా.. ప్రస్తుతం 100 పడకలే ఉన్నాయి. ఇప్పుడున్న భవనాలపైనే మరికొన్నింటినీ నిర్మిస్తున్నారు.

◆ ఇక్కడ కాన్పులకు సంబంధించిన శస్త్రచికిత్సలు మాత్రమే కొనసాగుతున్నాయి. ఇతర అత్యవసర సేవలు అందుబాటులో లేవు. దీంతో ఇక్కడకు వచ్చిన రోగులను హైదరాబాద్‌లోని గాంధీ, ఉస్మానియాలకు పంపుతున్నారు. ఇందులో జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగిన వారే ఎక్కువగా ఉన్నారు.

◆ వైద్య కళాశాల నిర్మాణానికి యాదగిరిగుట్ట పురపాలిక పరిధిలో 20 ఎకరాలకు కేటాయించారు. పనులు జరగాల్సి ఉంది.

◆ జిల్లా ఆసుపత్రి నుంచి వైద్యకళాశాలగా మారడంతో వైద్యులు సరిపడనంత మంది ఉన్నారు. ఆపరేషన్లకు సదుపాయాలు లేకపోవడంతో ఉన్నవారూ సర్జరీలు చేయడానికి వీలు పడటంలేదు.

సూర్యాపేటలో...

❑ సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రూ.లక్షలు విలువ కలిగిన యంత్రాలు అందుబాటులో ఉన్నప్పటికీ.. అర్హత కలిగిన సిబ్బంది లేకపోవడంతో అవి నిరుపయోగంగా మారాయి. రొమ్ము క్యాన్సర్‌ను నిర్ధారించే మమోగ్రాఫ్ యంత్రం ఉన్నప్పటికీ దానిని నిర్వహించే నిపుణుడైన ఆపరేటర్‌లేకపోవడంతో అది మూలకు చేరింది. గుండె సంబంధిత నిపుణుడైన వైద్యుడితో పాటూ నెఫ్రాలజీ వైద్యులు లేరు. రోగులు ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించి ఆర్థికంగా చితికిపోతున్నారు.

❑ మందుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. వైద్యులు రాసిచ్చిన మందుల చిట్టీని ఫార్మసీలో అందిస్తే ఎరుపురంగు పెన్నుతో టిక్‌పెట్టి అవి బయట తాము చెప్పిన మందుల దుకాణంలోనే తీసుకోవాలని రోగులకు చెబుతున్నారు. రక్త పరీక్ష కేంద్రాల్లో నమూనాలు సేకరించేందుకు అవసరమయ్యే సిరంజీలూ అందుబాటులో లేవు.

❑ మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు శస్త్రచికిత్స చేయాలంలే రోగులే సిరంజీలు, చేతి గ్లౌజులు, కావాల్సిన మందులను సమకూర్చుకోవాల్సి వస్తోంది. ఇటీవల బదిలీలు జరగడంతో సీనియర్ వైద్యులంతా వెళ్లిపోగా.. జూనియర్ వైద్యులతోనే ప్రస్తుతం నెట్టుకొస్తున్నారు.

ఐలమ్మ పోరాటం నేటి తరానికి ఆదర్శనీయం: అదనపు కలెక్టర్


నల్గొండలో ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర, పుర ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు

నీలగిరి, న్యూస్‌టుడే: వెట్టి చాకిరికి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ నేటి తరానికి ఆదర్శవంతురాలని అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా స్థానిక సాగర్ రోడ్డులోని రజక భవనం వద్ద గల ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తనకు సంబంధించిన భూమిని కాపాడుకోవడానికి ఆనాటి భూస్వాములతో పోరాడిన తీరు గొప్పదన్నారు. మన హక్కులను కాపాడుకోవడానికి ధైర్యంగా పోరాడటానికి ఆమె స్ఫూర్తిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పురపాలిక ఛైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఛైర్మన్ అబ్బగోని రమేశ్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు వంగూరు లక్ష్మయ్య, గుమ్మల మోహన్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చక్రహరి రామరాజు, రజక సంఘాల నాయకులు కొండూరి సత్యనారాయణ, చిలుకరాజు చెన్నయ్య, పగిళ్ల సైదులు తదిరులు పాల్గొన్నారు.

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: చాకలి ఐలమ్మ జయంతిని కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. స్పెషల్ కలెక్టర్ నటరాజ్, కలెక్టరేట్ కార్యాలయం ఏవో మోతీలాల్, తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఎత్తిపోతల పథకం
పంప్ హౌజ్ సంపుగోడ


కూలిన పంపుహౌజ్ సంపు గోడ

నిడమనూరు, న్యూస్‌టుడే: నిడమనూరులో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి, మండలంలోని ముప్పారం శివారులో గల ఎల్3 ఎత్తిపోతల పథకం పంప్ హౌజ్ సంపుగోడ కూలిపోయింది. దీంతో గోడ వెంట ఉన్న మట్టి మొత్తం సంపులో పడి, సంపు నుంచి నీటిని తోడే పైపుల్లోకి చేరింది. మట్టి, ఒండ్రు చేరడంతో ఎత్తిపోతల పథకం నుంచి నీటి పంపింగ్ బుధవారం పూర్తిగా నిలిచిపోయింది. నిడమనూరు, ముప్పారం, చింతగూడెం, పాలెం తదితర శివారు గ్రామాల్లోని దాదాపు 4800 ఎకరాల వ్యవసాయ భూమికి నీటిని సరఫరా చేసేలా అంచనాతో ఈ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. ప్రస్తుతం దాదాపు ఐదు వందల ఎకరాల వరకు వరి సాగు ఈ ఎత్తిపోతల పథకం నుంచి వెళ్లే నీటిపైనే ఆధారపడి ఉంది. గురువారం పంప్‌హౌజ్‌ను ఆ శాఖ ఈఈ కర్ణాకర్, డీఈఈ శ్రీనివాస్, ఏఈఈ జగపతిబాబు, ప్రవీణ్‌లతో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం తాత్కాలికంగా పూడిన మట్టిని తీసి గోడ వెంట అంచులు కూలకుండా ఇసుక బస్తాలు వేసి నీటి పంపింగ్ ప్రారంభిస్తామని, భవిష్యత్తులో గోడ నిర్మించేల ప్రతిపాదనలు తయారుచేసి పంపుతామని డీఈఈ శ్రీనివాస్ తెలిపారు.

మెస్ ఛార్జీలు పెంచాలని ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం గాడి తప్పిందన్నారు. విద్యార్థుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. వసతి గృహాల్లో కనీస వసతులు లేక విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. గురుకులాలకు నాసిరకమైన బియ్యం సరఫరా చేస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ధర్నాలో నరేష్, కావ్య, సైదానాయక్, తరుణ్, నవదీప్, స్పందన, శంకర్, రవిందర్, సంపత్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

28న జాతీయ లోక్ అదాలత్


నీలగిరి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు వివిధ కోర్టుల్లో బకాయి పడిన కేసులను శుక్రవారం నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా పరిష్కరించుకోవాలని జీఎం వెంకటేశం తెలిపారు. బకాయిలు చెల్లించడానికి ముందుకు వచ్చే వినియోగదారులకు తగిన రాయితీ పొందవచ్చని తెలిపారు.

సక్రమంగా పనిచేస్తాం..


విధుల్లోకి తీసుకోండి

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: విధుల్లో నిర్లక్ష్యం లేకుండా పనులు పూర్తిచేస్తామని.. అప్పగించిన పనులను రెండు వారాల్లో పూర్తిచేస్తామని .. మొదటి తప్పుగా భావించి తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఎంపీడీవో, ఎంపీవో, గ్రామపంచాయతీ కార్యదర్శులు కోరారు. ఇటీవల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎంపీడీవో, గ్రామ కార్యదర్శులపై కలెక్టర్ వేటు వేసిన విషయం తెలిసిందే. దీంతో సామూహికంగా సెలవు పెట్టారు. ఈ నేపథ్యంలో కలెక్టరేట్‌లో గురువారం రాత్రి ఎంపీడీవో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డిలు సమావేశమయ్యారు. కలెక్టర్ వచ్చిన తర్వాత సస్పెన్షన్ వేటు వేసిన వారిని విధుల్లోకి తీసుకునే విషయాన్ని పరిశీలిస్తామని .. మిగిలిన వారంతా విధుల్లోకి చేరాలని ఆదేశించారు. దీంతో శుక్రవారం నుంచి సామూహిక సెలవులు విరమించుకుని కార్యాలయ విధుల్లో పాల్గొని కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని విజయవతంగా నిర్వహిస్తామని వారంతా చెప్పారు.

పల్లె గల్లా.. ఖాళీ..!



నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీలను నిధుల కొరత వేధిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలుగా పంచాయతీలకు నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. ముఖ్యంగా ఆదాయ వనరులు అంతగా లేని చిన్న పంచాయతీల్లో కనీసం కార్మికులకు వేతనాలు చెల్లించలేని పరిస్థితి. గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం- పచ్చదనం, త్వరలో నిర్వహించే బతుకమ్మ, దసరా పండగ సంబరాలకు నిధుల లేమి సమస్యగా మారనుందని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.





జిల్లా	పంచాయతీలు	మండలాలు	చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులు (సుమారు)
నల్గొండ	868	33	రూ. 45 కోట్లు
సూర్యాపేట	486	23	రూ. 20 కోట్లు
యాదాద్రి	428	17	రూ. 14 కోట్లు

గాడితప్పిన పాలన..

గ్రామ పంచాయతీల్లో ప్రభుత్వం ఫిబ్రవరి 2న ప్రత్యేకాధికారులను నియమించింది. నిధుల లేమి, సిబ్బంది జీతాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పంచాయతీ పాలన గాడితప్పుతోంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం, మురుగు కాలువల్లో పూడికతీత, విద్యుత్తు దీపాల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్‌ల లీకేజీలు, ట్రాక్టర్లకు డిజిల్ కొరత ఇలా.. అనేక సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రత్యేకాధికారులు సైతం చేసేదేమీ లేక పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

జాడలేని ఎస్‌ఎఫ్‌సీ నిధులు

ఈ ఏడాది జనవరిలో కేంద్ర ప్రభుత్వం నుంచి 15వ ఆర్థిక సంఘం నిధులు కొద్దిమేర గ్రామ పంచాయతీ ఖాతాల్లో జమయ్యాయి. వాటితో పంచాయతీ కార్యదర్శులు కొన్ని నెలలుగా నెట్టుకొచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన ఎస్‌ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) నిధులు సైతం గత కొన్ని నెలలుగా విడుదల కాలేదు. గతంలో సర్పంచులు గ్రామాల్లో చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించాల్సి ఉంది.

✦ బ్లీచింగ్, వీధిలైట్లు, చేతిపంపుల సామగ్రి కొనుగోలు, పంచాయతీ నిర్వహణ ఖర్చులు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ప్రత్యేకాధికారులు పంచాయతీ పాలనను పెద్దగా పట్టించుకోవడం లేదు. దీంతో పూర్తిస్థాయిలో బాధ్యతలు పంచాయతీ కార్యదర్శులపై పడటంతో వారు అప్పులు చేసి పనులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

మానసిక ఉల్లాసం.. విజ్ఞాన వికాసం

శివలింగంపై.. నేరుగా సూర్యకిరణాలు



నేరేడుచర్ల: చారిత్రక భృగుమాలికా సోమేశ్వరాలయం

కాకతీయులు, రెడ్డిరాజుల పూజలందుకున్న చారిత్రక సోమప్ప దేవాలయం ఎన్నో ప్రత్యేకతలకు నిలయం. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం సోమారం, బూర్గులతండా గ్రామపంచాయతీల పరిధిలో మూసీనది తీరంలో ఉన్న ఈ ఆలయంలో ఏటా రెండు, మూడు రోజుల పాటు సూర్యకిరణాలు శివలింగంపై పడతాయి. ఈ ఆలయం వద్ద పెద్ద సొరంగ మార్గం ఉంది. అది శ్రీశైలం దాకా ఉందని చెబుతారు. ఆలయం రాతి స్తంభాలతో అద్భుత నిర్మాణశైలితో నిర్మితమైంది. ఆలయం ఎదుట నిర్మించిన ముఖద్వారం ఆకర్షణీయంగా కన్పిస్తుంది. 13వ శతాబ్దంలో దేవనాగరి లిపిలో రాజులు వేసిన ఆరు శిలా శాసనాలు కన్పిస్తాయి.

కల్పించాల్సిన సదుపాయాలు..

మూసీనదిలో భక్తులు పుణ్యస్నానాలు చేయడానికి ఘాట్ నిర్మించాలి. మిర్యాలగూడ నుంచి చిల్లేపల్లి మీదుగా సూర్యాపేట వెళ్లే రోడ్డును ఇప్పటికే డబుల్ రోడ్డుగా మారుస్తున్నారు. ఈ మార్గంలో బూర్గులతండా నుంచి 2 కిలోమీటర్ల దూరంలో సోమప్ప దేవాలయం ఉంది. ఈ రెండు కిలోమీటర్లు రెండు వరుసల తారు రోడ్డు నిర్మించాలి. ఆలయం వద్ద భక్తులకు మరికొన్ని మెరుగైన వసతులు కల్పించాలి. – న్యూస్‌టుడే, నేరేడుచర్ల, చిలుకూరు

❑ నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

పర్యాటక రంగానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. పర్యాటక ప్రదేశాలను సందర్శించడం ద్వారా మానసిక ఉల్లాసం పొందడంతో పాటుగా విజ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చు. సందర్శించే ప్రాంతాల్లోని ప్రజల సంస్కృతి, జీవనోపాధి తెలుసుకోవచ్చు. దేశంలోని ఆయా రాష్ట్రాల్లో రోజురోజుకి పర్యాటక రంగ అభివృద్ధి ఎంతో ముందుకెళ్తుంది. ఇంతటి ప్రాధాన్యతా రంగంపై నేటి యువత ఆసక్తి చూపుతున్నారు. పీజీ స్థాయిలో టూరిజం కోర్సులు పూర్తిచేసి అందివస్తున్న ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. ప్రధానంగా పర్యాటక ప్రదేశాల్లోని హోటల్స్ మేనేజర్లుగా, టూర్ గైడ్‌లుగా, టూర్ ఆపరేటర్లుగా, ఈవెంట్ మేనేజర్లుగా, టూరిజం శాఖలో ఆయా కొలువులు సాధించి స్థిరపడుతున్నారు. ఉమ్మడి జిల్లాలోని పర్యాటక ప్రదేశాల్లో ఏటా సందర్శకుల సంఖ్య పెరుగుతూ వస్తోంది.

–నల్గొండ టౌన్, న్యూస్‌టుడే:



పర్యాటక ప్రదేశాల సందర్శనలో ఎంజీయూ విద్యార్థులు

పర్యాటక రంగానికి ప్రాధాన్యం

మారం వెంకటరమణారెడ్డి,
ఎంజీయూ ఎంబీఏ టీటీఎం హెచ్‌వోడీ



పర్యాటకరంగానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పర్యాటకరంగం ఎంతో అభివృద్ధి సాధిస్తుంది. వర్సిటీలో ఎంబీఏ టీటీఎం కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఆయా పర్యాటక సంస్థల్లో మంచి ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ కోర్సు చదివేందుకు మక్కువ చూపాలి. నల్గొండ జిల్లాలో మంచి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వాటిని అభివృద్ధి చేస్తే పర్యాటకుల సంఖ్య పెరగడంతో పాటుగా యువతకు ఉపాధి లభిస్తుంది.

ఎంజీయూలో టూరిజం కోర్సు

ఎంబీఏ టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్ కోర్సు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఒక్క ఎంజీయూలోనే ఉంది. ఇక్కడ ప్రతి ఏటా 60 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతారు. కోర్సును వర్సిటీలో 2009లో ప్రారంభించారు. ఇప్పటి వరకు 12 బ్యాచ్‌లకు చెందిన విద్యార్థులు ఈ కోర్సు పూర్తిచేసి టూరిజం పరిధిలోని ఆయా సంస్థల్లో కొలువులు చేస్తున్నారు. మరికొందరూ సొంతంగా టూరిజం కార్యాలయాలు ఏర్పాటు చేసుకుని ఉపాధి పొందుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో..

కొలనుపాక జైన మందిరం, మ్యూజియం, దేవరకొండ, రాచకొండ కోటలు, నాగార్జున సాగర్, బుద్ధవనం, పచ్చల, ఛాయా సోమేశ్వర ఆలయం పానగల్లు, ఇలా మరిన్ని పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి. వీటి సందర్శనకు యేటా వేలాది మంది ఆయా ప్రాంతాల నుంచి వస్తుంటారు. ఈ ప్రదేశాల్లో టూర్ గైడ్‌లుగా పనిచేసే అవకాశం ఆసక్తి గల యువత లభిస్తాయి.


ఉమ్మడి జిల్లాలో చూడదగ్గ ప్రదేశాలు

భువనగిరి కోట, యాదాద్రి క్షేత్రం, కొలనుపాక జైన దేవాలయం, పణిగిరి బౌద్ధ స్తూపం, పిల్లలమర్రి ఎరకేశ్వర ఆలయం, మట్టపల్లి, మేళ్లచెరువు, జాన్‌పహాడ్ ఆధ్యాత్మిక క్షేత్రాలు, వాడపల్లి శివాలయం, పానగల్ ఛాయా సోమేశ్వరాలయం, వైజాగ్ కాలనీ, నాగార్జునసాగర్, బుద్ధవనం, దేవరకొండ కోట, బుగ్గ జలపాతాలు జిల్లాలో తప్పకుండా చూడాల్సిన ప్రాంతాలు.

✦ గత మూడేళ్లలో ఉమ్మడి జిల్లాలోని బుద్ధవనం, పణిగిరి, భువనగిరి కోటకు సుమారు రూ.400కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. యాదాద్రి క్షేత్రానికి సమీపంలోని బస్వాపూర్ రిజర్వాయర్‌ను సైతం పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు గత ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించింది.

కొత్త అందాలు తెరపైకి:

నల్గొండ జిల్లా మర్రిగూడ మండలం అజలాపురం గ్రామ పరిధిలోని అటవీ ప్రాంతంలో వచ్చిన కొండల నడుమ కొన్నేళ్ల క్రితమే తెరపైకి వచ్చిన బుగ్గ జలపాతం పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తుంది. నల్గొండ నయాగారాగా పేరు గాంచిన ఈ జలపాతం వర్షాలు పడే సమయంలో ప్రజలకు కనువిందు చేస్తుంది. వాడపల్లిలో పురాతన శివాలయం, సమీపంలోని కృష్ణా, మూసీ నదుల సంగమం ప్రాంతం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.



పిల్లలమర్రి ఎరకేశ్వర ఆలయం

ఆధ్యాత్మిక క్షేత్రాలు..

ఆలేరు సమీపంలోని పురాతన కొలనుపాక జైన దేవాలయం నుంచి సూర్యాపేట జిల్లాలోని బౌద్ధ మత ఆనవాళ్లకు నిలయంగా ప్రసిద్ధి చెందిన ఫణిగిరి క్షేత్రం, పురాతన శివాలయం దర్శనంతో పాటు ప్రకృతి అందాల పిల్లలమర్రి ఎరకేశ్వర ఆలయం, మట్టపల్లి, మేళ్లచెరువు, జాన్‌పహాడ్ ఆధ్యాత్మిక క్షేత్రాలు సైతం జిల్లాలో చూడదగ్గ ప్రదేశాలు.

– న్యూస్‌టుడే, మిర్యాలగూడ పట్టణం

ఇష్టంతో చదువుతున్నా

మనీషా, ఎంజీయూ విద్యార్థిని



నేను ప్రస్తుతం ఎంజీయూలో ఎంబీఏ టీటీఎం ద్వితీయ సంవత్సరం చదువుతున్నాను. ఎంతో ఇష్టంతో ఈ కోర్సు చదువుతున్నా. కోర్సులో చేరిన నాటి నుంచి పర్యాటకరంగంపై ఎంతో అవగాహన పొందాను. వివిధ రాష్ట్రాల్లోని పర్యాటక ప్రదేశాలు, అక్కడి సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకున్నాను. కొత్త ప్రదేశాలకు వెళ్లినప్పుడు ఎన్నో కొత్త విషయాలపై విజ్ఞానాన్ని పెంపొందించుకున్నాను.

కాలువలో గల్లంతైన వారిలో ఒకరి మృతదేహం లభ్యం

నిడమనూరు, న్యూస్‌టుడే: సాగర్ ఎడమ కాలువలో దుస్తులు ఉతకడానికి వెళ్లి త్రిపురారానికి చెందిన కూరగాయల దుకాణం యజమాని వేమవరపు సాయి(25), ఆ దుకాణంలో పనిచేసే మేదరి శైలజ (24) ప్రమాదవశాత్తు బుధవారం కాలువలో పడి గల్లంతయ్యారు. గల్లంతైన ఇద్దరిలో ఒకరైన శైలజ మృతదేహం గురువారం సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో త్రిపురారం మండలం కంపసాగర్ వద్ద లభ్యమైంది. ఆమె మృతదేహం తేలి నీటిలో కొట్టుకుపోతున్న విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి వెళ్లి బయటకు తీయించారు. మరో వ్యక్తి సాయి ఆచూకీ ఇంత వరకు లభ్యం కాలేదు.



☛ కాలువలో బుధవారం గల్లంతైన వేమవరపు సాయి, మేదరి శైలజ ఆచూకీ గురువారం మధ్యాహ్నం వరకు లభ్యం కాకపోవడంతో, కాలువకు నీటి విడుదల నిలిపి వేయాలని వారి బంధువులు మొదట ముకుందాపురం వద్ద రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పోలీసులు వారితో మాట్లాడి ధర్నా విరమింపజేశారు.

అమ్మ కావాలి..

త్రిపురారం: అమ్మ కావాలి.. అంటూ బోరున విలపిస్తున్న ముగ్గురు చిన్నారులను చూసి కంటతడి పెట్టని వారు ఎవరూ ఉండరు. శైలజకు ముగ్గురు కుమార్తెలు. మేదరి అని (12) 7వ తరగతి, మిల్కి(10) 6వ తరగతి, జ్యోష్ణ ప్రియ (8) 4వ తరగతి చదువుతున్నారు. తల్లి మరణవార్త తెలియగానే వారు అమ్మ కావాలని బోరున విలపిస్తుండటంతో వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. విషయం తెలిసిన వారంతా పెద్ద సంఖ్యలో మృతురాలి ఇంటి దగ్గరికి చేరుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు.

నీటి సంపులో పడి బాలుడి మృతి

భూదాన్‌పోచంపల్లి: నీటిసంపులో పడి బాలుడు మృతి చెందిన ఘటన పట్టణంలోని రామ్‌నగర్‌కాలనీలో గురువారం చోటుచేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి కథనం ప్రకారం.. బిహార్ రాష్ట్రంలోని పుట్నియా జిల్లా బర్హారా గ్రామానికి చెందిన అర్జున్‌దాస్ ఉపాధి నిమిత్తం పోచంపల్లిలో నివాసం ఉంటున్నాడు. గురువారం అర్జున్‌దాస్ పని నిమిత్తం బయటకు వెళ్లాడు. తల్లి నిద్రిస్తున్న సమయంలో కరణ్‌కుమార్(13నెలలు) సోదరుడితో కలిసి ఆడుకుంటూ ఇంటి ఆవరణలోని నీటిసంపులో పడి మునిగిపోయాడు. అదే సమయంలో పక్క ఇంట్లో అద్దెకు ఉంటున్న సంతోష్ ఇంటికి రావడంతో బాలుడి సోదరుడు సంపులో పడిపోయాడని తెలిపాడు. వెంటనే బాలుడిని సంపులో నుంచి తీయగా అప్పటికే మృతిచెందాడు. మృతదేహాన్ని మరణోత్తర నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



అదనపు కలెక్టర్ కాళ్లు మొక్కుతున్న రైతు అయిలయ్య

నియంత్రిక మంజూరు చేయాలని..

గుండాల, న్యూస్‌టుడే: లో ఓల్టేజీ కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోతున్నాయని, నియంత్రిక మంజూరు చేయాలని ఏడాదిగా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ఓ రైతు జిల్లా అదనపు కలెక్టర్ కాళ్ల మీద పడిన ఘటన గురువారం గుండాల మండల తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. అధికారులు కార్యాలయ సందర్శనకు వచ్చిన సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన రైతు గోపాల్‌దాసు అయిలయ్య లోఓల్టేజ్ విద్యుత్తు సమస్య ఉందని విద్యుత్తు అధికారులను సంప్రదించగా నియంత్రిక మంజూరుకు డీడీ చెల్లించాలని సూచించారు. డీడీ తీసి ఏడాది దాటినా నియంత్రికను మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారని రైతు అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్ కాళ్ల మీద పడి తన సమస్య వివరించారు. స్పందించిన అదనపు కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. త్వరితగతిన సమస్య పరిష్కరిస్తామని రైతుకు హామీ ఇచ్చారు.

బంగారం ఆశ చూపి.. రూ.లక్షలు కాజేసి

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: బంగారం ఆశ చూపి రూ.లక్షలు దోచుకుంటూ, పిల్లలు ఆడుకునే రూ.500 నోట్లను అమాయకులకు అంటగట్టి మోసం చేస్తున్న ముఠాను హుజూర్‌నగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు.

✧ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం మోదుగుండ్ల గ్రామానికి చెందిన సోదరులు నోముల ప్రకాష్, మత్స్యగిరి వ్యాపారంలో నష్టపోయారు. సులువుగా డబ్బులు సంపాదించాలని భావించి వారికి తెలిసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం అనుపాలేనికి చెందిన తాపీ మేస్త్రీ కొమెర రత్తయ్య అలియాస్ తిరుపతిరెడ్డి, బెల్లంకొండ మండలం మాసపాలెం కాలనీకి చెందిన బత్తుల రేణు, దేరంగుల కృష్ణవేణి మొత్తం ఐదుగురు కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరందరూ నకిలీ బంగారాన్ని అమ్మి డబ్బులు సంపాదించుకోవాలనుకున్నారు.

✧ ఈ క్రమంలో కొమెర రత్తయ్య, రేణు కలిసి సత్తెనపల్లిలో కొన్ని నకిలీ బంగారు బిస్కెట్లు తయారు చేయించారు. మునగాల మండలం నారాయణగూడెం గ్రామానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి గోపిరెడ్డి వెంకటరెడ్డిని ఈనెల 2న ప్రకాష్ కలిసి తన బంధువులు పాత ఇంటిని కూల్చివేస్తుండగా రెండు బంగారు బిస్కెట్లు దొరికాయని, వాటిని తక్కువ ధరకు తీసుకుందామని చెప్పి సాగర్ సిమెంట్ పరిశ్రమ మైన్స్‌కు వెళ్లే దారిలోకి తీసుకెళ్లాడు. రత్తయ్య నుంచి నకిలీ బంగారు బిస్కెట్లు తీసుకుందామని చెప్పి ప్రకాష్ తన వాటా కింద చిన్న పిల్లలు ఆడుకునే కాగితపు కరెన్సీతో వెళ్లి వెంకటరెడ్డి నుంచి రూ.7 లక్షలు తీసుకొని అతడికి బంగారం ఇవ్వకుండా పారిపోయారు. వెంకటరెడ్డి ఫిర్యాదు మేరకు మఠంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

✧ ఈ ముఠానే జెర్రిపోతులగూడెం గ్రామానికి చెందిన మాతంగి శ్రీనుకు బంగారం ఆశ చూపి అతడిని హుజూర్‌నగర్ పట్టణానికి రమ్మని చెప్పి అతడి నుంచి రూ.10 వేలు తీసుకున్నారు. శ్రీనుకు కూడా బంగారం ఇవ్వకపోవడంతో 24న హుజూర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ రెండు ఘటనలపై సీఐ చరమందరాజు విచారణ చేశారు. మాతంగి శ్రీనును గురువారం మఠంపల్లి రోడ్డులోని ఓ పెట్రోల్ బంకు వద్దకు డబ్బులు తీసుకొని వస్తే బంగారం ఇస్తామని చెప్పడంతో సీఐ సూచనల మేరకు ఉదయం డబ్బులతో వెళ్లగా.. అక్కడకు వచ్చిన నోముల ప్రకాష్, మత్స్యగిరి, కొమెర రత్తయ్యలు మాతంగి శ్రీనుకు నకిలీ బంగారం ఇస్తుండగా సీఐ చరమందరాజు సిబ్బందితో కలిసి పట్టుకున్నారు.

✧ పట్టుబడిన నేరస్థులు ఇచ్చిన సమాచారంతో కోదాడ పట్టణంలోని ఆర్‌కే లాడ్జిలో ఉన్న దేరంగుల కృష్ణవేణి, బత్తుల రేణులను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.7 లక్షల నగదు, రెండు ద్విచక్రవాహనాలు, ఒక ఆటో, 9 చరవాణులను, చిన్నపిల్లలు ఆడుకునే 761 కాగితపు రూ.500 నోట్లు (రూ.3,80,500 విలువ), మూడు నకిలీ బంగారు బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎస్సైలు ముత్తయ్య, నరేష్, ఏఎస్సై బలరాంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



నల్గొండ: అంబేడ్కర్ భవన్‌లో జర్నలిస్టుల వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

ప్రజాభిప్రాయం ప్రకారం వార్తలు రాయాలి

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజాభిప్రాయం ప్రకారం నిజ నిర్ధారణ చేసుకొని వార్తలు రాస్తే బాగుంటుందని జిల్లా అదనపు పాలనాధికారి పూర్ణ చంద్ర అన్నారు. నల్గొండలో గురువారం జర్నలిస్టులకు ఏర్పాటు చేసిన వర్క్‌షాపులో పాల్గొని మాట్లాడారు. సంచలన వార్తలకి ప్రాధాన్యం ఇవ్వకుండా సమాజానికి అవసరమయ్యేవాటికి సముచిత స్థానం కల్పిస్తే సమాజ మార్పునకు నాంది కావొచ్చన్నారు. జర్నలిజంలో నిరంతరం మనల్ని మనం నవీకరించుకోవాలని సూచించారు. సైబర్ క్రైమ్ డిప్యూటీ ఎస్పీ టి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి రోజు సుమారు రూ.5,6 కోట్లలో సైబర్ మోసాల వల్ల నష్టపోతున్నారన్నారు. నేరాల్లో బాధితులు, నేరస్థులు ఉండేవారని.. కానీ ఇప్పుడు సైబర్ క్రైమ్‌లో నేరస్థులు ఎక్కడో ఉండి మనకు చేయాల్సిన నష్టం చేస్తూనే ఉంటారన్నారు. నష్టపోతున్నవారిలో ఉన్నత విద్యావంతులే 90 శాతానికి పైగా ఉన్నారన్నారు. ప్రతి జిల్లాలో సైబర్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పీఐబీ డిప్యూటీ డైరెక్టర్ మానస్ కృష్ణకాంత్, దిలీప్ కుమార్‌రెడ్డి, సైంటిస్ట్ జగదీష్ బాబు, జిల్లా ఫీల్డ్ పబ్లిసిటి అధికారి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

28న ఉమ్మడి జిల్లాస్థాయి కుస్తీ పోటీలు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: నల్గొండ పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో ఈ నెల 28న ఉమ్మడి అండర్-14, 17 బాలబాలికల జిల్లా స్థాయి కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి వాసుదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు సకాలంలో హాజరుకావాలని కోరారు.

బీఈడీ ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ రెండవ సెమిస్టర్ పరీక్షలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. నల్గొండలో పలు పరీక్ష కేంద్రాలను ఎంజీయూ సీవోఈ ఉపేందర్‌రెడ్డి పరిశీలించారు. మొదటి రోజున పరీక్షకు 2469 మంది విద్యార్థులు హాజరయ్యారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	125–00
రిటైల్	147–00
డ్రెస్డ్	213–00
స్కిన్‌లెస్	243–00

రజితది హత్యా..? ఆత్మహత్యా..?

గుర్రంపోడు, న్యూస్‌టుడే: గుర్రంపోడు మండలం ముల్కలపల్లి వివాహిత మృతి కేసులో కీలక మలుపులు వెలుగు చూస్తున్నట్లు తెలుస్తోంది. రజితది హత్యా, ఆత్మహత్యా అన్న సందేహాల మధ్య విచారణ చేపట్టిన జిల్లా పోలీసు ఉన్నతాధికారులు హత్యేనని నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఆగస్టు 29న రాత్రి ఇంట్లో ఉరివేసుకుని చనిపోయిన వివాహిత జాల రజిత కేసులో పోలీసులు తొలుత అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనంతరం ఆత్మహత్యగా నమోదు చేయటంతో మృతురాలి బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న నిందితుల పేర్లను తొలగించిన పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు చోటుచేసుకున్నాయి. ఈ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో జిల్లా ఎస్పీ స్పందించి ఈ ఘటనపై జిల్లా అదనపు ఎస్పీ రాములునాయక్‌ను విచారణాధికారిగా నియమించారు. ఆయన విచారణలో పలు ఆసక్తికర అంశాలు వెలుగు చూస్తున్నట్లు చెబుతున్నారు. ఘటనాస్థలంలో మృతదేహం చూడగానే హత్యగానే భావించినప్పటికీ తర్వాత ఆత్మహత్యగా కేసు నమోదు చేయటం వెనుక ఎలాంటి అంశాలున్నాయన్న కోణంలో అదనపు ఎస్పీ విచారణను చేపట్టారు. భర్త ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్న నలుగురిని విచారించడంతో ఆత్మహత్య కాదని నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా నిందితుల నుంచి స్థానిక పోలీసులకు పెద్దమొత్తంలో డబ్బు చేతులు మారినట్లు వచ్చిన ఆరోపణలపై దృష్టి సారించిన పోలీసు ఉన్నతాధికారులు నిజ నిర్ధారణకు వచ్చినట్లు భావిస్తున్నారు. త్వరలోనే విచారణను పూర్తి చేసి కీలక సూత్రధారుల గుట్టును బయటపెట్టేందుకు జిల్లా ఉన్నతాధికారులు సిద్ధమవుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పదహారేళ్లకు.. సర్కారు కొలువులోకి..!

నల్గొండ విద్యావిభాగం, నడిగూడెం, న్యూస్‌టుడే: డీఎస్సీ-2008లో నష్టపోయిన అభ్యర్థులకు ఒప్పంద పద్ధతిలో ఎస్జీటీలుగా నియమించేందుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో నష్టపోయిన వాళ్లు 391 మంది ఉన్నారు. దాదాపు 16 ఏళ్ల తరువాత సమస్య పరిష్కారం అయింది. కాంగ్రెస్ ఎన్నికల ప్రణాళికలో డీఎస్సీ- 2008 అభ్యర్థులకు న్యాయం చేస్తామని ఇచ్చిన హామీ మేరకు ఒప్పంద విధానంలో నెలకు రూ.31,080 వేతనం చొప్పున చెల్లించి ఎస్జీటీ ఉద్యోగాలు ఇచ్చేందుకు నిర్ణయించింది.

✦ బాధితులు ఉమ్మడి నల్గొండ జిల్లాలో 391 మంది ఉన్నా.. ఆ తర్వాత జరిగిన డీఎస్సీ, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు సాధించడంతో ప్రస్తుతం 270 మంది వరకు మిగిలి ఉండొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. చాలా మంది వివిధ పనులు, వ్యాపారాల్లో నిమగ్నమయ్యారు. 1967-69 మధ్య కాలంలో పుట్టిన వాళ్లు కూడా ఈ డీఎస్సీ రాశారు. ఇప్పటికే వారిలో కొంత మందికి 57 ఏళ్లు దాటాయి. ఎక్కువ మంది 50 ఏళ్ల వయస్సుకు దగ్గర్లో ఉన్నవాళ్లే ఉద్యోగంలో చేరనుండటం గమనార్హం.

నేటి నుంచి పత్రాల పరిశీలన..

డీఎస్సీ- 2008 అభ్యర్థులను ఒప్పంద పద్ధతిలో నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు జారీచేసినట్లు డీఈవో బి.భిక్షపతి తెలిపారు. సంబంధిత అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు పాఠశాల విద్యా తెలంగాణ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూస్కూల్ ఎడ్యు.తెలంగాణ.జీవోవి.ఇన్ నందు దరఖాస్తు ఫారం, అభ్యర్థుల జాబితా పొందుపరిచారని చెప్పారు. తమ ధ్రువీకరణ పత్రాల పరిశీలన కోసం శుక్రవారం నుంచి అక్టోబరు 5వ తేదీ వరకు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలన చేయించుకోవాలని సూచించారు.

న్యాయం జరిగింది: మహ్మద్ షరీఫ్, కరివిరాల



డీఎస్సీ పరీక్షకు హాజరై కొలువుకు అవసరమైన మార్కులు సాధించినా.. డీఈడీ అభ్యర్థులకు ఎస్జీటీ పోస్టులు కేటాయించడంతో చివరి నిమిషంలో తీవ్ర అన్యాయం జరిగింది. 15 ఏళ్లుగా సుదీర్ఘ పోరాటం చేశాం. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని ఎట్టకేలకు 48 ఏళ్ల వయస్సులో కొలువుకు ఎంపిక కావడం సంతోషంగా ఉంది.

ఆశ వదులుకున్నా: నాగరాజు, వెంకట్రాంపురం



ఎంఏ, బీఈడీ పూర్తి చేశాను. డీఎస్సీలో చివరి నిమిషంలో ఉద్యోగం చేజారింది. అప్పటి నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా ప్రభుత్వ కొలువు రాలేదు. చేసేది లేక ఇంటర్‌నెట్ సెంటర్ ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాను. న్యాయస్థానం తీర్పుతో ప్రభుత్వం కనీసం కాంట్రాక్టు పద్ధతిలోనైనా కొలువులకు ఎంపిక చేసినందుకు ఆనందంగా ఉంది.

నట్టల నివారణ ఏమాయె..!

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు లేక అనారోగ్యం బారిన పడుతున్నాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వం సరఫరా చేయాల్సిన మందులు సరఫరా కావడం లేదు. దీంతో జీవాల పెంపకందారులు ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బంది పడాల్సిన పరిస్థితి నెలకొంది.

✦ ఉమ్మడి జిల్లాలో 23.21 లక్షల గొర్రెలు, 5.86 లక్షల మేకలు ఉన్నాయి. వాటికి నట్టల నివారణకు ఏటా రెండు సార్లు పశుసంవర్ధక శాఖ అధికారులు నట్టల మందులను జీవాలకు వేస్తారు. ప్రభుత్వం గత రెండేళ్లుగా వాటిని సరఫరా చేయడం లేదు. వానాకాలం సీజన్ ప్రారంభంలో ఆ తర్వాత సీజన్ ముగిసి నీరు ఇంకిపోయే దశలో నట్టల వ్యాధి ఎక్కువగా వ్యాపిస్తుంది. నట్టల మందు వేయడం వల్ల జీవాలు ఆరోగ్యంగా ఉంటాయి.

వచ్చిన వెంటనే వేస్తాం.. జూలకంటి వెంకటరెడ్డి, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి. నల్గొండ

ప్రస్తుతం గొర్రెల, మేకలకు కావాల్సిన నట్టల నివారణ మందులు అందుబాటులో లేవు. ప్రభుత్వం నుంచి సరఫరా కావట్లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం నుంచి రాగానే పంపిణీ చేస్తాం.

గొర్రెలు, మేకల సంఖ్య..

జిల్లా	గొర్రెలు	మేకలు
నల్గొండ	912625	336182
సూర్యాపేట	779920	140000
యాదాద్రి	628600	110000

నల్గొండ

• నల్గొండ • మునుగోడు • నకిరేకల్

కమ్యూనిస్టులను ఆదరించాలి: బొజ్జ

కేతేపల్లి,న్యూస్‌టుడే: ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేసే కమ్యూనిస్టులను ప్రజలు ఆదరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు చెప్పారు. గుడివాడలో ఆ పార్టీ సమావేశం జరిగింది. పేదలకు కనీస అవసరాలను కల్పించాలని డిమాండ్ చేస్తూ తాము ఉద్యమాలు, ఆందోళనలు నిర్వహిస్తున్నామన్నారు. రాజు, లూర్ధుమారయ్య, ఎల్లయ్య, ఎం. జానకిరాములు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి.. చిట్యాల: అర్హులైన చిట్యాల పురపాలికలోని పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలో గురువారం జరిగిన తమ పార్టీ పట్టణ మహాసభలో ఆయన మాట్లాడారు. ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు శంకరయ్య, మండల కార్యదర్శి శ్రీను, యాదయ్య, సుగుణమ్మ పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతోనే అధిక దిగుబడి

మునుగోడు: పత్తి సాగులో ఆధునిక పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడి పొందవచ్చునని ఏఈవో నర్సింహగౌడ్ సూచించారు. సింగారంలో పత్తి పంటలను పరిశీలించారు. పత్తిలో సూక్ష్మపోషక లోపాలు గుర్తించినట్లు తెలిపారు. వెంటనే మెగ్నీషియం, కాపర్, జింక్, బోరాన్ వంటి మందులను పిచికారీ చేస్తే అదుపులోకి వస్తుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 80085 52710, 80085 66199 8008574421, 80085 74385

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:

? పట్టణంలోని శాంతినగర్‌లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. వాహనదారులపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. నివారణ చర్యలు తీసుకోవాలి.
– ఎన్‌వీఎన్, నల్గొండ.

✔ పరిశీలించి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. – శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టరు, నల్గొండ పురపాలిక.

మైదానం చెరువైంది..

నల్గొండలోని మేకల అభినవ్ స్టేడియంలో వర్షపు నీరు నిలిచి క్రీడాకారులు అడుగుపెట్టడానికి వీలు లేకుండా పోయింది. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వరదంతా మైదానంలో చేరింది. బయటికి వెళ్లడానికి దారులు మూసుకుపోవడంతో స్టేడియం చెరువులా తయారైంది. రన్నింగ్ ట్రాక్ చుట్టూ సైతం నీరు నిలిచింది.



– ఈనాడు, నల్గొండ:

చదరంగంలో జాతీయస్థాయిలో ప్రతిభ

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్రీయ విద్యాలయం విద్యార్థులు జాతీయస్థాయి చదరంగ పోటీల్లో ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇటీవల అహ్మదాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీలకు హైదరాబాద్ రీజియన్ నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో అంజనీ శశాంక, సత్య గంగాధర్, పి.దాస్ జాతీయ స్థాయి చెస్ ఛాంపియన్‌షిప్ సాధించారు. వీరు జాతీయ స్థాయి స్కూల్ గ్రేమ్ ఫెడరేషన్ చెస్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు నల్గొండ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ జి.శ్రీనివాస్ తెలిపారు.

ఆ రాళ్లపై.. అక్రమార్కుల కళ్లు



బ్రాహ్మణవెల్లంల ప్రాజెక్టు నుంచి అక్రమంగా రాళ్ల తరలింపు

నార్కట్‌పల్లి గ్రామీణం న్యూస్‌టుడే:

ఒకవైపు బ్రాహ్మణ వెల్లంల ప్రాజెక్టు పనులు కొనసాగుతుండగా.. మరో వైపు అక్రమంగా రాళ్లు తరలించుకపోతున్నారు. రిజర్వాయర్ నిర్మిత ప్రాంతంలో పెద్దపెద్ద బండలు ఉన్నాయి. వాటిని ఎలాంటి అనుమతులు లేకుండా అడ్డగోలుగా పగులగొట్టి విక్రయిస్తున్నారు. అంతటితో ఆగకుండా రిజర్వాయర్ కట్టకు వేసిన రాతి లైనింగ్ రాళ్లను సైతం ఎత్తుకెళ్తున్నారు. పగలు, రేయి తేడా లేకుండా సాగుతున్న ఈ దోపిడీని అరికట్టేవారే లేకపోయారు.

★ ఉదయ సముద్రం ప్రాజెక్టుకు అనుసంధానమైన నార్కట్‌పల్లి మండలం శివారులోని బ్రాహ్మణ వెల్లంల రిజర్వాయర్‌లో పెద్ద బండరాళ్లు ఉన్నాయి. వాటిని ఎలాంటి అనుమతి లేకుండా పగులగొట్టి అక్రమంగా విక్రయిస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ ప్రాజెక్టు సుమారుగా 400 ఎకరాల్లో విస్తరించి ఉంది. రిజర్వాయర్‌లోకి నీళ్లొచ్చినప్పుడు మట్టి జారిపోకుండా ఉండటం కోసం గ్రానైట్ రాళ్లతో రాతి కట్టడం ఏర్పాటు చేశారు. ఆ రాతి కట్టడాన్ని పెకిలించి రాళ్లను ఎత్తుకెళ్తున్నారు. నిర్మాణ పనులకు వినియోగించగా మిగిలిన రాళ్లు, కంకర వంటి వాటిని అక్రమార్కులు తరలించి విక్రయిస్తున్నారు. ఒక ట్రాక్టర్‌కు రూ.5 వేలు తీసుకొని నూతనంగా ఇళ్లు నిర్మించే వారికి, స్థిరాస్థి వ్యాపారులు, ప్రహరీ ఏర్పాటు చేస్తున్న వారికి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. వాస్తవానికి సంబంధిత ప్రాజెక్టు అధికారుల ద్వారా అనుమతి తీసుకుని నిర్ణీత ధర చెల్లించి తీసుకెళ్లాల్సి ఉంది.



కుప్పలుగా రాళ్లు

చర్యలు తీసుకుంటాం:

నవీన్, ఐబీ, ఏఈ

ప్రాజెక్టులోని బండరాళ్లను అక్రమార్కులు తరలించుకుపోకుండా నిఘా పెడతాం. అక్రమంగా రాళ్లను తరలిస్తున్నవారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం.

చెత్తను తొలగించి.. శుభ్రం చేయించి

నకిరేకల్, న్యూస్‌టుడే: నకిరేకల్‌లో పురపాలిక చెత్త డంపింగ్ యార్డులో నిరుపయోగంగా ఉన్న కంపోస్టు షెడ్డును వినియోగంలోకి తీసుకొచ్చేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. 'పంపిణీకి నోచుకోని బుట్టలు' శీర్షికతో 'ఈనాడు'లో బుధవారం వచ్చిన కథనానికి కమిషనర్ బాలయ్య, పర్యావరణ ఇంజినీరు నాగరాజు స్పందించారు. కంపోస్టు షెడ్డు చుట్టూ గుట్టలుగా పోసిన చెత్తను తొలగించి శుభ్రం చేయించారు.

మురుగు కాల్వలు శుభ్రం

నల్గొండ పురపాలిక: చైతన్యపురికాలనీలో మున్సిపల్ సిబ్బంది మురుగు కాల్వలు శుభ్రం చేశారు. ఈ సమస్యను ఒక పాఠకుడు 'న్యూస్‌టుడే' దృష్టికి తీసుకురావడంతో మీమున్నాం.. మీకుతోడుగా ద్వారా గురువారం ప్రచురితమైన వార్తకు పుర అధికారులు స్పందించారు. మురుగు కాల్వలు శుభ్రం చేసి నిల్వ నీటిని దిగువకు వెళ్లేలా చర్యలు చేపట్టారు.

మహిళా ధీరత్వానికి ప్రతీక చాకలి ఐలమ్మ



నార్కట్‌పల్లిలో ఐలమ్మ చిత్ర పటానికి పూల మాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



నకిరేకల్: రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ పూజల శంభయ్య



మర్రిగూడలో ఐలమ్మ విగ్రహానికి అభిషేకించి పూలు చల్లుతున్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

జిల్లాలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. పలు చోట్ల నిర్వహించిన కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఐలమ్మ పోరాట పటిమ నేటి తరం యువతకు ఆదర్శనీయమని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. – న్యూస్‌టుడే, బృందం



నల్గొండ: ఆర్డీవో శ్రీదేవి..



మునుగోడులో సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం..



నల్గొండ ప్రభుత్వ బాలికల కళాశాలలో..

హామీలన్నీ అమలు చేస్తాం: రాజగోపాల్‌రెడ్డి

నాంపల్లి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తుందని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. నాంపల్లి మండలం నరసింహులగూడెంలో రూ.3కోట్లతో నిర్మించనున్న 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రానికి ఆయన గురువారం శంకుస్థాపన చేసి మాట్లాడారు. విద్యుత్తు శాఖ డీఈ ఎం.సాగర్‌రెడ్డి, ఏఈ శివప్రసాద్, పీఏసీఎస్ ఛైర్మన్ గట్టుపల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్తీని విక్రయిస్తే చర్యలు

చండూరు, న్యూస్‌టుడే: రోడ్లపై తిను బండారాలను విక్రయించే దుకాణదారులు, కిరాణ దుకాణ యజమానులు కల్తీ ఆహార పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి హెచ్చరించారు. గురువారం రాత్రి చండూరు పుర పరిధిలో ఆకస్మికంగా పర్యటించి పలు కిరాణ, తిను బండారాల దుకాణాలను పరిశీలించారు. మిర్చి బండి నిర్వాహకుడితో నాణ్యమైన ఆహార పదార్థాలు విక్రయించాలని రూ.10 వేల నగదును అందజేశారు. అనంతరం నాలాలను పరిశీలించారు. మండల అధ్యక్షుడు ఓంకారం, వైస్ ఛైర్‌పర్సన్ సుజాత, వెంకటేశ్వర్లు, శ్రీనివాసు, గిరి బాబు, మల్లేశం, వెంకటేశం, రాజు, మల్లేషం, రాజు పాల్గొన్నారు.

ఆరుగురికి గాయాలు

చిట్యాల, న్యూస్‌టుడే: జాతీయరహదారిపై వెలిమినేడు శివారులో ఆర్టీసీ బస్సును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొట్టిన ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయపడ్డారని ఎస్సై ఎన్.ధర్మా పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ ఆర్టీసీ డిపోకుచెందిన బస్సు హైదరాబాద్ వైపు వెళుతోంది. బస్సు వెలిమినేడుకు చేరుకుంటుండగా వెనుకనుంచి వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సులోని ఆరుగురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి శివారులోని ఆసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పనులు ప్రారంభం

నకిరేకల్: కాలంవారి చెరువు సుందరీకరణ పనుల్లో భాగంగా రెండో బతుకమ్మ ఘాట్ నిర్మాణ పనులను పుర ఇన్‌ఛార్జి ఛైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి గురువారం ప్రారంభించారు. నకిరేకల్‌ను ఆదర్శ పురపాలికగా అభివృద్ధి చేసేందుకు కృషిచేస్తామని చెప్పారు. కమిషనర్ డి.బాలయ్య, కౌన్సిలర్లు గాజుల సుకన్య, రాచకొండ సునీల్, గర్లకోటి సైదులు, తదితరులు పాల్గొన్నారు.

అవగాహన సదస్సు

నల్గొండ టౌన్: ఎన్జీ కళాశాలలో స్వచ్ఛత సేవ, ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ఉపేందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవ అలవర్చుకోవాలని కోరారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీజీఎం జగదీశ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మొక్కలు నాటారు. గోమతి, వెంకటరెడ్డి, శివరాణి, మల్లేశం, అనిల్, సావిత్రి, పాల్గొన్నారు.

పుర కార్మికులకు వైద్యశిబిరం.. నకిరేకల్: స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పుర కార్యాలయంలో పారిశుద్ధ్య కార్మికుల కోసం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కమిషనర్ డి.బాలయ్య, వైద్యాధికారిణి కావ్య, ఆరోగ్య విస్తరణ అధికారి నర్సింహాచారి, ఇంజినీరు నాగరాజు పాల్గొన్నారు.

అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

తిప్పర్తి, న్యూస్‌టుడే: అసత్య ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న వ్యక్తిపై కేసు నమోదయింది. పోలీసుల కథనం ప్రకారం.. పాతపల్లెకు చెందిన షేక్ కఫీర్ ఈ నెల 15న రాత్రి రహదారి ప్రమాదంలో మృతిచెందాడు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్‌పై కేసు నమోదు చేశారు. ఈ విషయాన్ని తప్పుదోవ పట్టిస్తూ జానీ అనే వ్యక్తి బుధవారం వాట్సప్ గ్రూపులో ప్రాణం ఖరీదు రూ.2 లక్షలు అంటూ పోలీసులపై తప్పుడు ప్రచారం చేశాడు. ఇది ఇతర గ్రూపుల్లో వైరల్ అయింది. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు అతడిపై ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రామ్మూర్తి తెలిపారు.

మోదుగు కుంట ఆక్రమణపై ఆర్డీవో పరిశీలన

నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే: నల్గొండ సమీపంలోని గంధవారిగూడ పరిధి మోదుగు కుంట ఆక్రమణపై ఫిర్యాదు రావడంతో నల్గొండ ఆర్డీవో శ్రీదేవి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరువులు, కుంటలు ఆక్రమిస్తే సహించేది లేదన్నారు. నీటి పారుదల అధికారులు మాట్లాడుతూ కుంట ఆక్రమణ అవుతుందని 2012లోనే తెలిపామన్నారు. 13 ఎకరాల విస్తీర్ణంలో కొంత పట్టాభూమి ఉన్న మరి కొంత ప్రభుత్వ భూమి ఉందన్నారు. కుంట బఫర్‌జోన్, ఎఫ్‌టీఎల్ ఎంత వరకు ఉందనేది సర్వే చేసి తెలపాలని ఆర్డీవో ఆదేశించారు. తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ గౌస్ తదితరులు పాల్గొన్నారు.



మోదుగుకుంటను పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీదేవి

దుప్పట్ల పంపిణీ

నల్గొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: నల్గొండలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులకు ఇండియా రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో దుప్పట్లు, పెన్నులు, కూర్చోవడానికి పట్టాలు అందచేశారు. ఇటీవల కలెక్టర్ ఆ పాఠశాలను సందర్శించారు. కలెక్టర్ సూచనల మేరకు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి ఈ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. వైస్ ఛైర్మన్ డా.పుల్లారావు, శ్రీనివాస్‌రెడ్డి, జెల్ల దశరథ, ఊరుకొండ ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం జానకిరాములు, తదితరులు పాల్గొన్నారు.



నల్గొండలో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి, వైస్ ఛైర్మన్ డా.పుల్లారావు, సభ్యులు



హైదరాబాద్‌లోని సీసీఎంబీ సందర్శనలో ఎన్జీ కళాశాల విద్యార్థులు

సీసీఎంబీ సందర్శించిన ఎన్జీ కళాశాల విద్యార్థులు

నల్గొండ టౌన్, న్యూస్‌టుడే: ఎన్జీ కళాశాల మైక్రోబయాలజీ, బయోటెక్నాలజీ విద్యార్థులు గురువారం హైదరాబాద్‌లోని జీవకణ రసాయన శాస్త్ర సంస్థ (సీసీఎంబీ)ని సందర్శించారు. విద్యార్థులు శాస్త్ర సాంకేతిక పరిశోధనలు, జీవకణశాస్త్రం, బయోటెక్నాలజీ రంగాల్లో తాజా పరిశోధనలు, అభివృద్ధులను సమీపంగా తెలుసుకున్నారు. బి.నాగరాజు, గాంజయ్య, పాల్గొన్నారు.

ఫోర్జరీ చేశారనే ఫిర్యాదుపై కేసు నమోదు

చిట్యాల, న్యూస్‌టుడే: తన సంతకం ఫోర్జరీ చేసి తనపేరిట బ్యాంకులో రూ.2లక్షల రుణం తీసుకున్నారని మండలంలోని సుంకెనపల్లికి చెందిన చిట్టిపోలు మౌనిక ఇచ్చిన ఫిర్యాదుపై ఆమె భర్త ప్రవీణ్‌పై కేసునమోదు చేశామని ఎస్సై ఎన్.ధర్మా గురువారం పేర్కొన్నారు. మండలంలోని గుండ్రాంపల్లిలో ఏపీజీవీ బ్యాంకులో తన పేరిట గతేడాది డిసెంబరులో రుణం తీసుకున్నట్లు తన దృష్టికి రాగా బ్యాంకుకు వెళ్లి సంప్రదించగా రుణం తీసుకున్నట్లు దస్త్రాలు చూపించారని మౌనిక పేర్కొన్నారని ఎస్సై తెలిపారు. గత కొంతకాలంగా అభిప్రాయ బేధాలతో ఫిర్యాదుదారు తన భర్తతో విడిగా ఉంటున్నారని ఎస్సై పేర్కొన్నారు.

అవీ ఇవీ

సిబ్బందిని నియమించాలని వినతి.. నకిరేకల్: స్థానిక వీటీ కాలనీ ఎస్‌బీఐ శాఖలో అదనపు సిబ్బందిని నియమించాలని కోరుతు బ్యాంకు ఆర్‌ఎంకు వినతిపత్రం పంపించామని నకిరేకల్ విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వంటల రామలింగం, కందుల సోమయ్య, కోశాధికారి భిక్షంరెడ్డి గురువారం తెలిపారు.

ఎమ్మెల్యే పరామర్శ.. నకిరేకల్: అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం నల్గొండలోని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి(డీఆర్డీవో) శేఖర్‌రెడ్డిని ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఏపీడీ మోహన్‌రెడ్డి, నకిరేకల్ పీఏసీఎస్ ఛైర్మన్ నాగులంచ వెంకటేశ్వరరావు, పుర కౌన్సిలర్లు సైదులు, సునీల్, కొండయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం.. నకిరేకల్: నకిరేకల్ లయన్స్ క్లబ్, లయన్స్ నవ్య క్లబ్ ఆధ్వర్యంలో మంగళపల్లిలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని ఉచిత శస్త్రచికిత్సలకు ఎంపికచేశారు. డా.ఆర్.వీరబ్రహ్మం, ఎన్.రాంమోహన్‌రావు, బి.ప్రకాశరావు, ఎన్.రమాదేవి పాల్గొన్నారు. సూర్యాపేట లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది సేవలందించారు.

మంత్రి ఆర్థిక సాయం.. కనగల్: కురంపల్లి గ్రామానికి చెందిన తలారి కళమ్మ ఇటీవల మృతి చెందగా ఇద్దరు పిల్లలు అనాథలుగా మారారు. వారి వెంటనే స్పందించి రూ.50 వేలు సీనియర్ కాంగ్రెస్ నాయకులు నంద్యాల లక్ష్మారెడ్డి, తలారి రవీందర్, జగాల్‌కు అందజేయగా ఆట్టి డబ్బులను గురువారం చిన్నారులకు అందజేశారు.

కులగణన ప్రక్రియ వేగవంతం చేయాలి: జాజుల.. మర్రిగూడ: రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బాలయ్య, శ్రీనివాస్, సత్యనారాయణ, సత్తిరెడ్డి, బాస్కర్, కిరణ్ పాల్గొన్నారు.

నేడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి.. నల్గొండ గ్రామీణం: నల్గొండలోని జిల్లా చేనేత ప్రారిశ్రామిక సంక్షేమ నిధి భవనంలో శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నిర్వహిస్తున్నట్లు సంక్షేమ నిధి అధ్యక్ష, కార్యదర్శులు సత్యనారాయణ, రాపోలు దత్తగణేష్ ప్రకటనలో తెలిపారు.

పేదలకు సాయం.. కేతేపల్లి: నిరుపేదలకు తమవంతు సహాయం చేస్తే తగిన గుర్తింపు, ఆదరణ ఉంటుందని మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు చందా రామమూర్తి చెప్పారు. కొర్లపహాడ్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న ఎడ్ల సైదులు కుటుంబానికి గురువారం నిత్యావసరాలు అందజేశారు. నాయకులు బి.అంజయ్య, ఎ.ఆనయ్య తదితరులు పాల్గొన్నారు.

కుర్చీల పంపిణీ.. నార్కట్‌పల్లి గ్రామీణం: మండల కేంద్రంలోని మహాత్మజ్యోతిరావు పూలే గురుకుల కళాశాలకు ఆసర స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మేడి హరికృష్ణ కుర్చీలు పంపిణీ చేశారు. ప్రిన్సిపల్ మదానాచారి, ఉపాధ్యాయులు విద్యాసాగర్, రాజ్‌కుమార్, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

మద్యం పట్టివేత.. మునుగోడు: చీకటి మామిడిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారం మేరకు స్థానిక పోలీసులు దాడులు నిర్వహించారు. దోటి నరసింహ దుకాణంలో మద్యాన్ని స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

యూటీఎఫ్ కార్యవర్గం.. నకిరేకల్: టీఎస్ యూటీఎఫ్ నకిరేకల్ మండల శాఖ నూతన అధ్యక్షుడిగా టి.నర్సింహమూర్తి, ఉపాధ్యక్షులుగా బి.శ్రీనివాస్, ఏ.సైదమ్మ, ప్రధాన కార్యదర్శిగా కుర్మిళ్ల శ్రీనివాస్, కోశాధికారిగా ఈ.హరికృష్ణ, కుటుంబ సంక్షేమ నిధి కన్వీనర్‌గా ఎం.మల్లేశ్, మహిళా కన్వీనర్‌గా వై.సునీత గురువారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని సమాఖ్య జిల్లా కార్యదర్శి యాట మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఎన్నికల పరిశీలకునిగా పి.వెంకటేశం వ్యవహరించారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి.. చండూరు: యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై వెంకన్న సూచించారు. గురువారం చండూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గంజాయిపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రధానాచార్యులు ఘన్ శ్యామ్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక అధికారి శ్రీనివాసు, అధ్యాపకులు బాల సైదులు, జ్యోతి, పద్మజా పాల్గొన్నారు.

సినిమాలు

నల్గొండ కల్చరల్, నకిరేకల్, న్యూస్‌టుడే

నల్గొండ: **పీవీఎన్:** దేవర, **నటరాజ్:** దేవర, **వెంకటేశ్వర:** దేవర

నకిరేకల్: **రామకృష్ణ**- హైడ్-న్-సీక్ **వెంకటేశ్వర**- దేవర

రహదారులు ఇలా.. ప్రయాణం ఎలా..?



హౌసింగ్‌బోర్డుకాలనీ కూడలిలో..

న్యూస్‌టుడే, నల్గొండ జిల్లా పరిషత్తు

రహదారులు పట్టణాల, పల్లెల ప్రగతికి సూచిక.. ఆ రోడ్లు ధ్వంసం ప్రగతి ప్రతిబంధకమే. జిల్లా కేంద్రం నుంచి మునుగోడు వెళ్లే మార్గం, పట్టణంలోని ఎన్టీఆర్ నగర్ నుంచి హౌసింగ్‌బోర్డుకాలనీ బైపాస్ రోడ్లపై ప్రయాణం నరకంగా మారింది. రోడ్ల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో పలు గుంతలు ఏర్పడ్డాయి. వాటికి మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రధానంగా ఈద్గ, హౌసింగ్‌బోర్డుకాలనీ ఆంజనేయస్వామి ఆలయం కూడలి, ఎన్టీఆర్‌కాలనీ, కంచనపల్లి శివాలయం, దోమలపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంతాల్లో తారు రహదార్లు ధ్వంసం అయ్యాయి. గుంతల్లో వరద నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేయించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

■ ఈ విషయంపై పుర కమిషనర్ ముసాబ్ అహ్మద్ సయ్యద్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేయిస్తామని తెలిపారు.



ఎన్టీఆర్‌కాలనీ వద్ద..

చివరి దశలో రైతు కుటుంబాల నిర్ధారణ



నకిరేకల్: చందంపల్లిలో రైతు కుటుంబాల వివరాలు తీసుకుంటున్న వ్యవసాయ అధికారులు

నకిరేకల్, న్యూస్‌టుడే:

పంట రుణమాఫీకి సంబంధించి రేషన్ కార్డులు లేని రైతు కుటుంబాల నిర్ధారణ ప్రక్రియ నకిరేకల్ వ్యవసాయ డివిజన్ పరిధిలో చివరిదశకు చేరింది.. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన రైతుల పంట రుణమాఫీకి అర్హత ఉండి సాయం అందని వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించిన విషయం తెలిసిందే. రేషన్ కార్డులు లేని రైతు కుటుంబ సభ్యుల గ్రూపింగ్ ప్రక్రియను ఆన్‌లైన్ యాప్‌లో పూర్తిచేసే పనులను వ్యవసాయాధికారులు నిర్వహిస్తున్నారు. నకిరేకల్ వ్యవసాయ డివిజన్‌లోని కేతేపల్లి, నకిరేకల్, కట్టంగూరు, చిట్యాల, నార్కట్‌పల్లి, శాలిగౌరారం మండలాల్లో గ్రూపింగ్ కొనసాగుతోంది.

మండలాల వారీగా ఇలా..

మండలం	రైతుల సంఖ్య	మాఫీ పొందిన వారు	రైతుల ఖాతాల్లో జమైన నిధులు (రూ.కోట్లలో)	అర్హత ఉండి మాఫీ కాని వారు	ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో నమోదైనవారు
నకిరేకల్	13643	4394	35.32	1601	1154
కేతేపల్లి	12940	3694	26.24	1889	1649
కట్టంగూరు	17494	4320	34.02	1241	894
నార్కట్‌పల్లి	17685	4979	42.70	1680	1117
చిట్యాల	18873	6184	53.52	1580	1393
శాలిగౌరారం	19035	6051	48.69	1726	1175

డివిజన్‌లో ఇలా..

- మొత్తం రైతుల సంఖ్య: 99,670
- పంట రుణమాఫీకి అర్హత పొందిన రైతులు: 39,339
- ఇప్పటి వరకు రుణమాఫీ సొమ్ము జమఅయిన రైతులు: 29,622
- మూడు విడతల మాఫీలో రైతుల ఖాతాల్లో జమఅయిన మొత్తం: రూ.240.51 కోట్లు
- అర్హత ఉండి రుణమాఫీ అందని రైతులు: 9,717
- ఇప్పటి వరకు ఆన్‌లైన్ యాప్‌లో నమోదైన రైతుల సంఖ్య: 7,382

76 శాతానికి పైగా పూర్తి



మహ్మద్ జానీమియా, ఇన్‌ఛార్జి ఏడీఏ, నకిరేకల్

పంట రుణమాఫీకి సంబంధించి అర్హత ఉండి రేషన్ కార్డులు లేని రైతు కుటుంబ సభ్యుల ఆన్‌లైన్ నిర్ధారణ ప్రక్రియ డివిజన్‌లో చివరి దశకు చేరుకుంది. గురువారం నాటికి 76 శాతానికిపైగా ఆన్‌లైన్ నమోదును పూర్తిచేశాం. కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయించుకోవాలని మిగిలి ఉన్న రైతులకు ఫోన్లుచేసి సమాచారం ఇస్తున్నాం.

మిర్యాలగూడ

•మిర్యాలగూడ •నాగార్జునసాగర్ •దేవరకొండ

ఎనిమిది నెలల తరువాత పురపాలిక సమావేశం

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: మిర్యాలగూడ పురపాలిక పాలకవర్గ సమావేశం సుదీర్ఘ విరామం ఎనిమిది నెలల తరువాత శుక్రవారం నిర్వహించనున్నారు. జిల్లాలోనే అతిపెద్దదిగా గ్రేడ్ వన్ స్థాయి పురపాలికగా ఉన్న మిర్యాలగూడ పట్టణంలో ప్రతి నెల పాలకవర్గ సమావేశం నిర్వహించి ప్రజా సమస్యలు చర్చించాల్సి ఉండగా ఏడు నెలలుగా సమావేశం ఏర్పాటు చేయలేదు. దీని కారణంగా పట్టణంలో పాలకవర్గం చర్చించి నిర్ణయం తీసుకోవాల్సిన పలు సమస్యలు ఎక్కడికక్కడే నిలిచాయి. రాజకీయ కారణాలతో నాయకుల మధ్య సమన్వయం కుదరక సమావేశాలు నిర్వహించలేదని పట్టణంలో పుకార్లు గుప్పుమంటున్నాయి. ఎట్టకేలకు సమావేశం జరగనుండగా రాజకీయాలు మాని ప్రజా సమస్యలు చర్చించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. జనవరి 24 తరువాత పాలకవర్గ సమావేశం ఏర్పాటు చేయలేక పోయామని కమిషనర్ యూసుఫ్ తెలిపారు. ఎజెండాలో సమస్యలు చర్చించేలా చూస్తామన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

అడవిదేవులపల్లి, న్యూస్‌టుడే: రుణమాఫీ కాని రైతులు కుటుంబ నిర్ధారణకు దరఖాస్తు చేసుకోవాలని ఏవో గుర్రం సంతోష్ కోరారు. 89 మంది అర్హులైన రైతులు కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయించుకోవాల్సి ఉందని.. రైతు, రైతు కుటుంబ సభ్యుల ఆధార్ కార్డు జిరాక్సుల ధ్రువపత్రానికి జతచేసి ఇవ్వాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) 77994 92939 99121 74975 98487 81656

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే:

? పట్టణంలోని విద్యానగర్‌లో కుక్కలు స్వైర విహారం చేస్తూ దాడులు చేస్తుండటంతో అనేక ఇబ్బందులు పడుతున్నాం. - కృష్ణారెడ్డి, మిర్యాలగూడ.

✔ కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం. - ఎండీ యూసుఫ్, పుర కమిషనర్, మిర్యాలగూడ.

విస్తరణ పనులకు తవ్వి... పది నెలలుగా వదిలేసి

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: పట్టణంలోని నందిపాడు ప్రధాన రహదారిని అసెంబ్లీ ఎన్నికలకు ముందు విస్తరణ కోసం గానూ రెండు వైపులా తవ్వి అసంపూర్తిగా వదిలివేయటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మిర్యాలగూడ పట్టణంలోని వచ్చేందుకు నందిపాడు, బలాపురం, తండాలకు చెందిన వారు ఈ మార్గంలో నిత్యం ప్రయాణిస్తుంటారు. పట్టణంలో అంతర్గత రహదారుల విస్తరణ పనులకోసం గాను ఈ మార్గంను తవ్వారు. రెండు వైపులా కంకర మిక్సర్ పోసి చదును చేశారు. సిమెంటు రహదారి మరో వరస నిర్మించాల్సి ఉండగా ఎన్నికల కోడ్ రావటంతో నిలిపివేశారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు పూర్తయినప్పటికీ విస్తరణ పనులు పూర్తి చేయలేదు. దీంతో తరచూ కురుస్తున్న వర్షాలకు నీరు గుంతల్లో నిలిచి చిన్నారులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి విస్తరణ పనులు పూర్తి చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. పాలకవర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ యూసుఫ్ తెలిపారు.

నందిపాడు రహదారిలో తరచు ప్రమాదాలు



నందిపాడు ప్రధాన రహదారిని రెండు వైపులా పది నెలల క్రితం తవ్వి వదిలేసిన తీరు

క్రీడాకారులకు బహుమతుల అందజేత

హాలియా, న్యూస్‌టుడే: హాలియా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భగత్‌సింగ్ జయంతి ఉత్సవాల సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఆటల పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. గురువారం మండల విద్యాధికారి గుండా కృష్ణమూర్తి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా, డివిజన్ అధ్యక్షులు ఆకారపు నరేష్, జగదీష్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యుడు కందుకూరి కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

28న కేంద్ర సహాయ మంత్రి బండి రాక

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని నెల్వలపల్లి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త బుర్ర పెద్దమల్లయ్య విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఈ నెల 28న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ హాజరవుతున్నట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెనమోని రాములు, మండల అధ్యక్షుడు శివర్ల రమేష్‌యాదవ్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత.. ప్రతి విద్యార్థి బాధ్యత

హాలియా, న్యూస్‌టుడే: చదువుతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించడం ప్రతి విద్యార్థి బాధ్యత అని పుర కమిషనర్ రామదుర్గారెడ్డి అన్నారు. గురువారం ఆయన స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని శ్లోక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. అనంతరం పాఠశాలలో మొక్కలను నాటి మానవహారంతో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం అంజనేయులు, ఎన్విరాన్‌మెంట్ ఇంజినీర్ రవికుమార్ పాల్గొన్నారు.



హాలియాలో మొక్కను నాటుతున్న పుర కమిషనర్ రామదుర్గారెడ్డి, తదితరులు

భాజపా ఇంటింటి సభ్యత్వ నమోదు

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: అన్ని వర్గాల సంక్షేమం కోసం భాజపా ప్రభుత్వం పాలన అందిస్తుందని ప్రజలంతా భాజపాలో చేరి మద్దతు తెలపాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని 8, 9 వార్డుల్లో గురువారం భాజపా ఇంటింటి సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బంటు సైదులు, పురుషోత్తంరెడ్డి, హనుమంతరెడ్డి, శంకర్, అజయ్, లక్ష్మారెడ్డి, వేణు, ఐలా శ్రీను, సాయి పాల్గొన్నారు.

★ అనంతరం సాగర్ రోడ్డుపై చాకలి ఐలమ్మ విగ్రహానికి భాజపా నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు.

దామరచర్ల: భాజపా సభ్యత్వ నమోదుకు అన్ని వర్గాల ప్రజల నుంచి ఆదరణ లభిస్తోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాధినేని శ్రీనివాసరావు అన్నారు. దామరచర్లలో పార్టీ జిల్లా కార్యదర్శి ఈగా సైదారావు ఆధ్వర్యంలో సభ్యత్వం మొబైల్ యాప్ ద్వారా సభ్యత్వ నమోదు ప్రారంభించారు. జానకిరాంరెడ్డి, బంటు సైదులు, నర్సింహారెడ్డి ఉన్నారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

ఎమ్మెల్యే బాలునాయక్‌కు నిరసన సెగ

చింతపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కుర్మేడ్ గ్రామ సమీపంలో కంపెనీ నుంచి వస్తున్న పొగతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, అలాంటి ఫ్యాక్టరీకి సంబంధించిన గోదాముకు ప్రారంభోత్సవానికి ఎలా వెళ్తారని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్‌ను గురువారం రాత్రి స్థానికులు అడ్డుకొని నిరసన తెలిపారు. గ్రామ సమీపంలో ఇటీవలే ఈ ఫ్యాక్టరీని నిర్మించి పనులు చేపట్టారు. రెండు నెలల నుంచి వాసన, పొగతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. తాను ప్రజల పక్షాన ఉంటానని, ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఫ్యాక్టరీపై విచారణ చేయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అయినా గ్రామస్థులు శాంతించకపోవడంతో చేసేదేమీ లేక వెనుదిరిగారు.

కళాశాలలో మౌలిక వసతుల కల్పనకు కృషి

దేవరకొండ, న్యూస్‌టుడే: దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అన్ని వసతులు కల్పించడానికి అహర్నిశలు కృషిచేస్తానని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పేర్కొన్నారు. కళాశాలలో గురువారం నిర్వహించిన పదో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. యువతతోనే సమాజ మార్పు సాధ్యమని తెలిపారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బంగారు, ప్రశంసా పత్రాలు అందజేశారు. నల్లగాసు జాన్, సిరాజ్‌ఖాన్, సురేష్‌గౌడ్, గోరింకలర్, వేణుధర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రవి, డాక్టర్ క. పుష్ప, శిరందాసు కృష్ణయ్య, పిజె సాంసన్ తదితరులున్నారు.

108 వాహనం ప్రారంభం.. డిండి: అత్యవసర సమయంలో 108 సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో నూతన 108 వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఎస్‌హెచ్‌ఎం నిధుల నుంచి మంజూరైన రూ.20 లక్షలతో వావిలికోల్‌లో నిర్మించనున్న పల్లె దవాఖానా పనులను ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేష్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, బుచ్చిరెడ్డి, విజేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వైద్యాధికారి శైలీ తదితరులు పాల్గొన్నారు.



కొండమల్లేపల్లి: పైపులైను ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

క్రీడలతోనే మానసిక ఉల్లాసం.. చింతపల్లి: క్రీడలతోనే మానసిక ఉల్లాసం కల్గుతుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. గురువారం మండలంలోని కుర్మేడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన క్రీడ పోటీల ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. సంజీవరెడ్డి, పవన్, హరినాయక్, ఉప్పు శ్రీశైలం పాల్గొన్నారు.

క్రైం రిపోర్ట్

పురుగు మందు తాగి యువకుడు మృతి

త్రిపురారం, న్యూస్‌టుడే: పురుగు మందు తాగి యువకుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అల్లాపాడుతండాకు చెందిన ధనావత్ వెంకటేష్ (32) అదే గ్రామానికి చెందిన ధనావత్ బాలుతో 15 ఏళ్ల నుంచి భూవివాదం ఉంది. దీంతో మనస్తాపానికి గురై ఈనెల 24 తేదీన ఇంట్లో పురుగుల మందు తాగడంతో గమనించిన భార్య, కుటుంబ సభ్యులు మిర్యాలగూడ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుని భార్య ధనావత్ జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ గురువారం తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి కిందపడి మహిళ..

వేములపల్లి, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పైనుంచి కిందపడి మహిళ మృతి చెందగా, మరో మహిళకు తీవ్ర గాయాలైన ఘటన గురువారం మాడుగులపల్లి మండల పరిధిలోని కల్వలపాలెం గ్రామ శివారులో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పాములపాడుకి చెందిన దోతాగాని శైలజ (30) తమతోటి నాట్లు వేసిన కొంతమంది కూలీలతో కలిసి గుర్రప్పగూడెం గ్రామ శివారులో ఉన్న మైసమ్మ వద్ద మొక్కు తీర్చుకోవడానికి.. గ్రామానికి చెందిన కడకాల సత్తిరెడ్డి ట్రాక్టర్‌లో గురువారం ఉదయం బయలుదేరారు. తిరుగు ప్రయాణంలో రాత్రి ఏడు గంటల ప్రాంతంలో కల్వలపాలెం గ్రామ శివారులోని బ్రిడ్జి వద్దకు రాగానే.. స్పీడ్ బ్రేకర్ ఉండటం గమనించి ఒక్కసారిగా బ్రేక్ వెయ్యగా ట్రాక్టర్ ఇంజిన్‌పై కూర్చున్న మహిళల్లో ఇద్దరు కింద పడగా.. శైలజ పైనుంచి ట్రాక్టర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఒక కుమారుడు ఉన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం...

గుర్రంపోడు: తన భూమిలో నాటిన మిరప చేనును కొందరు వ్యక్తులు ధ్వంసం చేయడంతో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటన గుర్రంపోడు మండలం తేనేపల్లిలో గురువారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తేనేపల్లికి చెందిన బుడిగొండ వెంకటయ్యకు పూర్వీకుల నుంచి 5 ఎకరాల భూమి వారసత్వంగా సంక్రమించింది. ఇందిరమ్మ పథకంలో ప్రభుత్వం ఇతనికి పట్టా చేసినట్లు చెబుతున్నారు. 60 ఏళ్లుగా తాతల నుంచి కాస్తు, కబ్జాలో ఉన్న భూమిని రెవెన్యూ అధికారులు గ్రామానికి చెందిన మరొకరికి పట్టా చేయడంతో అతను మానసిక వేదనకు గురయ్యాడు. ఆ భూమిలో ఇటీవలే మిరప చేను నాటాడు. అది కాస్త ఏపుగా పెరిగే క్రమంలో గురువారం ఉదయం పూర్తిగా ధ్వంసం చేసి ఉండటం గుర్తించి గుండెపగిలేలా ఏడ్చాడు. ఆక్రమంలో పట్టా చేసుకున్నవారే పైరును ధ్వంసం చేశారని భావించిన వెంకటయ్య అక్కడే ఉన్న పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉన్న వెంకటయ్యను నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడే వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై ఫిర్యాదు అందినట్లు పోలీసులు తెలిపారు.

బీక్యానాయక్ మృతి బాధాకరం

డిండి, న్యూస్‌టుడే: మండలంలోని జాల్‌తండాకు చెందిన సీపీఐ సీనియర్ నాయకుడు రమావత్ బీక్యానాయక్ మృతి బాధాకరమని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వెంకటరమణ, బుచ్చిరెడ్డి, మైనొద్దీన్, కనకచారి, శైలేష్, విజేందర్‌రెడ్డి, రామస్వామి తదితరులున్నారు.

స్వచ్ఛందంగా కాలువ పూడికతీత పనులు

హాలియా, న్యూస్‌టుడే: గత రెండేళ్లుగా కాలువ ద్వారా సాగునీరు రాకపోవడంతో గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఈనెల 25న 'చివరికి నీరేది' శీర్షికన ఈనాడులో వచ్చిన కథనానికి అనుముల మండలం మారేపల్లికి చెందిన ప్రముఖ న్యాయవాది ఎంపీ. హరూన్ అంజుమ్ సొంత ఖర్చులతో సుమారు రూ.50 వేలతో పంటకాలువ పూడికతీత పనులు చేపట్టారు. గురువారం ఏఎమ్మార్ ప్రాజెక్టు డీ-25 కాలువను గుర్రంపోడు నుంచి మారేపల్లి వరకు జేసీబీ సహాయంతో కాలువలోని కంపచెట్లు తొలగించారు. దీంతో గుర్రంపోడు మండలం తుర్కపల్లి, ఆజలాపురం, అన్నారం, మారేపల్లితో పాటు సుమారు పది గ్రామాల రైతులకు మేలు జరుగనుంది. పూడికతీత అనంతరం ఉన్నతాధికారులతో మాట్లాడి కాలువకు సాగునీరు రాకకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.



మారేపల్లి వద్ద జేసీబీ సహాయంతో డీ-25 కాలువ పూడిక తీత పనులు

ఫిర్యాదుల విచారణలో రాష్ట్రంలో ఉత్తమ ఎస్సైగా రాంబాబు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుల విచారణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మిర్యాలగూడ రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సై రాంబాబు రాష్ట్రంలో రెండో స్థానం సాధించి డీజీపీ జితేందర్ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులపై తక్షణ నిర్ణయం తీసుకుని వాటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేసి రాష్ట్ర స్థాయిలో రెండో స్థానంలో నిలిచినట్లు ఎస్సై రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఎస్సై రాంబాబును అభినందించారు. పట్టణంలో డీఎస్పీ రాజశేఖర్‌రాజు, రెండో పట్టణ సీఐ నాగార్జున ఎస్సైకి మిఠాయిలు తినిపించి అభినందనలు తెలిపారు.



మిర్యాలగూడలో ఎస్సై రాంబాబును అభినందిస్తున్న డీఎస్పీ రాజశేఖర్ రాజు, సీఐ నాగార్జున

మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం: సీఐ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల వల్ల జీవితాలు నాశనం అవ్వడంతో పాటు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతాయని మిర్యాలగూడ ఒకటో పట్టణ సీఐ కరుణాకర్ అన్నారు. మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని ఎస్సీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఎస్సైగా శేఖర్

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి నూతన ఎస్సైగా వి.శేఖర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. మిర్యాలగూడ వన్‌టౌన్ ఎస్సైగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. బాధ్యతలు స్వీకరణ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మండల పరిధిలో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు ప్రాధాన్యం ఇస్తానని, నేరాలకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ సందర్భంగా స్టేషన్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

దేవరకొండ, న్యూస్‌టుడే: ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డి.విజయ్య పేర్కొన్నారు. మండలంలోని ముదిగొండ ఆశ్రమ పాఠశాలలో గురువారం పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు చేశారు. హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, కిశోర బాలికలు తదితరులున్నారు.



ముదిగొండ ఆశ్రమ పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది, హెల్త్ సిబ్బంది, విద్యార్థినిలు

చింతపల్లి: పౌష్టికాహారంతోనే విద్యార్థులకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పలువురు అధికారులు సూచించారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం పోషణ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయురాలు అంజలి, పద్మ, పద్మావతి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ గ్రామీణం: పోషణ మాసంలో భాగంగా మండల పరిధిలోని శ్రీనివాసనగర్‌లో ఆదర్శ, గురుకుల పాఠశాల, రుద్రారంలో అంగన్‌వాడీ కేంద్రంలో వారు గురువారం కిశోర బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించి పోషకాహారంపై సీడీపీఓ మమత అవగాహన కల్పించారు. పర్యవేక్షణాధికారి ఐలు ఆర్.వాణి, రాధిక, అంగన్‌వాడీ టీచర్లు భవాని, సత్య, పద్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని...

త్రిపురారం, న్యూస్‌టుడే: వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్ఏలను సర్దుబాటు చేయడానికి 81, 85, 98 జీవోలను తీసుకువచ్చింది. దీని వల్ల ఎలాంటి లబ్ధి జరగక పోగా పదవీ విరమణ సమయంలో ఉన్న వారు నష్టపోతున్నారని తెలిపారు. 55 నుంచి 61 ఏళ్ల వయస్సు గల గ్రామ రెవెన్యూ సహాయకుల సంబంధించిన సమస్యలను మానవీయ కోణంలో పరిష్కరించాలని కోరారు.

రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

గుర్రంపోడు, న్యూస్‌టుడే: ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున రైతులు పత్తి సాగులో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి మాధవరెడ్డి సూచించారు. గుర్రంపోడు, ముల్కలపల్లి గ్రామాల పరిధిలోని పత్తి చేలను గురువారం ఆయన పరిశీలించి రైతులకు తగు సూచనలు చేసి మాట్లాడారు.

తరలివెళ్లి.. వినతి అందించి

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును యథావిధిగా ఉంచాలని కోరుతూ ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు గురువారం జిల్లా కేంద్రానికి ఆర్యవైశ్య సంఘం సభ్యులు భారీగా తరలివెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సంఘం మండల గౌరవాధ్యక్షుడు జిన్నం రాంమూర్తి, జనార్దన్, శ్రీనివాస్, కరుణాకర్ తదితరులున్నారు.

మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలి

దేవరకొండ: గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచించారు. గురువారం దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో ఏర్పాటు చేసిన మంచినీటి సరఫరా సహాయకుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్‌ఈ వెంకటేశ్వర్లు, డీఈ నగేష్, మాజీ ఎంపీపీ నల్లగాసు జాన్, ఏఈలు యువరాజు, ధనుంజయ తదితరులున్నారు.

కొండమల్లేపల్లి: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే బాలునాయక్ పేర్కొన్నారు. మండలంలోని చెన్నారం నుంచి గన్యానాయక్‌తండా వరకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ.15 లక్షలతో నూతనంగా నిర్మించిన పైప్‌లైన్ పనులు సుమారు మూడు నెలల క్రితం పూర్తికాగా గురువారం ఆయన ప్రారంభించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏవీ ఐబీ

27న చలో విద్యార్థి మహాగర్జన.... దేవరకొండ: రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 27న చలో హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు రామావత్ లక్ష్మణ్‌నాయక్, బుడిగె వెంకటేష్ తెలిపారు. గురువారం దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గోడప్రతికలు ఆవిష్కరించి మాట్లాడారు.

మిర్యాలగూడ పట్టణం: విద్యార్థి మహా గర్జనకు అధిక సంఖ్యలో తరలిరావాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ కోరారు. మిర్యాలగూడలో గురువారం మహాగర్జన గోడ పత్రికలు ఆవిష్కరించి మాట్లాడారు. సైదా, లక్ష్మణ్, రమేష్, వెంకటేష్, జగన్, వీరన్న, నితిన్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాలో నేడు అంతరాయం... మిర్యాలగూడ పట్టణం: వివిధ మరమ్మతు పనుల నేపథ్యంలో పట్టణంలో రెడ్డికాలనీ, హనుమాన్‌పేట కాకతీయ పాఠశాల ప్రాంతాలతో పాటు పై వంతెన నుంచి కాంబీజేరీ వరకు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు రెండో పట్టణ ఏఈ వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉపకార వేతనాలు విడుదల చేయాలి... దేవరకొండ: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు విడుదల చేయాలని యూఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ సోహైల్ అన్నారు. యుఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఆర్డీవో కార్యాలయ ఇన్‌ఛార్జి డీఏవో అయ్యూబ్‌ఖాన్‌కు వినతిపత్రం అందజేశారు. కె.హేమంత్, రాంబాబు, నాగేందర్ తదితరులున్నారు.

పంపిణీ... మిర్యాలగూడ: మిర్యాలగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయుడు కస్తూరి వెంకటేశ్వర్లు, హరిప్రసాద్‌లు గురువారం క్రీడా దుస్తులు ప్రధానోపాధ్యాయుడు ధర్మా నాయక్ పంపిణీ చేశారు. పోల్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పోటీ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచితంగా అధ్యయన సామగ్రిని అందజేశారు. శ్రీనివాస్, మల్లయ్య, అశోక్‌రెడ్డి, శ్రీను, కృష్ణకాంత్ నాయక్ పాల్గొన్నారు.

ప్రజా సంఘాల్లో బాధ్యులుగా పాల్గొనాలి... వేములపల్లి: మాడుగులపల్లి మండల పరిధిలోని పాములపాడులో గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శాఖ మహాసభ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్, మండల కార్యదర్శి శ్రీనివాస్, శ్రీకర్, నాగమణి, అశోక్‌రెడ్డి, గోవర్ధన, వెంకటరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినతి... మిర్యాలగూడ పట్టణం: జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమా టిక్కెట్ల ధరలను అధికంగా పెంచిన వాటిపై చర్యలు తీసుకుని.. ధరలు తగ్గించాలని కోరుతూ తెదేపా, ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం మిర్యాలగూడలో సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌కు వినతిపత్రం అందించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు పెద్దిటెలం శ్రీనివాస్, గణేష్, రాజశేఖర్, శంకర్, దర్మతేజ, శోభనాద్రి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించాలి... మిర్యాలగూడ: నిరుపేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహించి అంధకారంను రూపు మాపేందుకు ప్రైవేటు వైద్యులు సామాజిక బాధ్యత వహించాలని ఎమ్మెల్యేలు వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి కోరారు. పట్టణంలో ప్రాణ కంటి, దంత వైద్యశాలను గురువారం వారు ప్రారంభించి మాట్లాడారు. డాక్టర్ బసవ పున్నారావు, బిందుశ్రీ, ఐఎంఏ అధ్యక్షులు జీవన జ్యోతి ఆసుపత్రి వైద్యులు అనంత నాగ్, ప్రియాంక పాల్గొన్నారు.

నేత్ర వైద్య శిబిరం... నిడమనూరు: నిడమనూరు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ రంగశాయిరెడ్డి ఆధ్వర్యంలో, బొమ్మిశెట్టి తేపమాసేల చెందిన పుట్ట సుధాకర్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు హైదరాబాద్‌కు చెందిన ప్రభుత్వ శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల వారితో, శుక్రవారం నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు బొమ్మిశెట్టిపల్లెలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి, ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యే రఘువీర్‌రెడ్డి హాజరవుతారని, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంకతి సత్యం తెలిపారు.

సినిమాలు

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే

రాఘవ: దేవర, వెంకటేశ్వర: దేవర

విట్రోస్: మత్తు వదలరా-2, దేవర, శ్రీనివాస: మత్తు వదలరా - 2

తెలంగాణ విముక్తికి పోరాడిన ఐలమ్మ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: రజాకర్లు, దొరలను గడగడలాడించిన చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు సాగించాలని మిర్యాలగూడ, నకిరేకల్ ఎమ్మెల్యేలు బీఎల్ఆర్, వేముల వీరేశం అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా గురువారం మిర్యాలగూడలో ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించి మాట్లాడారు. డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్, అర్జున్, బాసాని గిరి, యరుగాని, వెంకటేశ్వర్లు, సైదులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్: తెలంగాణ విముక్తి కోసం పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని సాగర్ సీఐ బీసన్న అన్నారు. ఐలమ్మ జయంతి సందర్భంగా హిల్‌కాలనీ విజయవిహార్ సమీపంలో ఉన్న ఆమె విగ్రహం వద్ద నివాళి అర్పించారు. ఎస్సై సంపత్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నాగరాణి, వార్డు కౌన్సిలర్లు, రజక సంఘం నాయకులు జంగయ్య, కృష్ణ, విజయ, తదితరులు పాల్గొన్నారు.


★ సాగర్‌లోని టీజీ గురుకుల విద్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాజశేఖర్, ఏటీపీ గాయత్రి, ఇతర ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.

త్రిపురారం: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తాసిల్ కార్యాలయంలో గురువారం చాకలి ఐలమ్మ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు నివాళి అర్పించారు. తహసీల్దార్ ప్రమీల, ఎంపీడీవో కార్యాలయ పర్యవేక్షకుడు దయాకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ భరద్వాజ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హాలియా: హాలియాలో పురపాలక సంఘం కార్యాలయంలో, ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో, జడ్పీ ఉన్నత పాఠశాల్లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు నిర్వహించారు. గురువారం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంఈవో కృష్ణమూర్తి, ప్రిన్సిపల్ ఘన్‌శ్యామ్, నరేష్, జగదీష్ పాల్గొన్నారు.



దేవరకొండలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్



మిర్యాలగూడలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు బీఎల్ఆర్, వేముల వీరేశం, తదితరులు

చింతపల్లి: మధనపురంలో బీసీ సంఘం ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని నిర్వహించారు. జిల్లా నాయకులు అనంతుల రామకృష్ణ, శేఖర్ పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండల కేంద్రంలోని చౌరస్తాలో రజక సంఘం ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. పీఏపల్లి మాజీ వైస్ ఎంపీపీ అర్వపల్లి సరిత, నర్సింహ, సైదులు, సత్తయ్య, లింగం, శ్రీను, ఆంజనేయులు, వెంకటయ్య పాల్గొన్నారు.

దేవరకొండ: చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఐలమ్మ విగ్రహానికి ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. భూమి కోసం, భుక్తి కోసం రజాకార్ల ఆగడాలను ఎదిరించి చాకలి ఐలమ్మ చేసిన పోరాటం నేటి యువతకు ఆదర్శమన్నారు.

డిండి: మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. తహసీల్దార్ ఆంజనేయులు, డీటీ రాగ్యానాయక్, ఆర్ఐ శ్యాం, శివ తదితరులున్నారు.

★ పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మల్లేష్, వెంకటేశ్వర్లు, రవినాయక్, గౌతంరెడ్డి, మంగారెడ్డి, నాగేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేములపల్లి: ఎంపీడీవో కార్యాలయంలో గురువారం చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఏపీవో మిరాజోద్దీన్, నరేష్, నర్మద, విజయలక్ష్మీ, సుష్మా, కార్తికా, అనిత, మీరోజ్, సునంద పాల్గొన్నారు.



దేవరకొండలో చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



మిర్యాలగూడలో చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు